
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
ఆదివారం 23 ఫిబ్రవరి 2025

గ్రూప్స్-2 పరీక్షలకు పటిష్ట బందోబస్తు

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రూప్స్-2 పరీక్షలకు పోలీసులు బారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో 30 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్స్-2 పరీక్షలు జరుగుతున్నట్లు డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఓ సీఐతో పాటు పోలీసు సిబ్బంది, మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా మొత్తం మీద 30 మంది సీఐలు, 30 మంది ఎస్ఐలు, 680 మంది పోలీసులతో, డ్రోన్, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు.



పెంచికలపాడులో మూతపడిన సీసీఐ కేంద్రం.

మూతపడ్డ సీసీఐ కేంద్రాలు

- ఆవేదనలో పత్తి రైతులు
- సగం పత్తి ఇళ్లు, కల్లాల్లోనే..
- ఉమ్మడి జిల్లాలో 5 లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- 40 లక్షల క్వింటాళ్ల దిగుబడి
- సీసీఐ కొనింది కేవలం రూ.4లక్షల క్వింటాళ్లే
- మార్కెటింగ్ అధికారుల నిర్లక్ష్యం..

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో 5లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. గత ఐదేళ్లలో ఎప్పుడూ లేనంత దిగుబడి ఈసారి రైతుకు అందింది. గతంలో రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే చేతికి అందగా..ఈసారి దిగుబడి 8 నుంచి 10 క్వింటాళ్ల దాకా వచ్చిందని రైతులు సంబరపడ్డారు. రైతుల నుంచి క్వింటం పత్తిని సేకరించేందుకు 7,500 చెల్లిస్తామని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించడంతో రైతులు సంబరపడ్డారు. అయితే.. పత్తి కొనుగోళ్లను ఉమ్మడి కర్నూలు జిల్లాలో నవంబరు నెలలో ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లాలో ఒక్క కేంద్రాన్ని కూడా తెరవలేదు. కర్నూలు జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో 12 చోట్ల సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసింది. మధ్యమధ్యలో వివిధ కారణాలతో రైతుల నుంచి నామమాత్రంగానే పత్తిని కొనుగోలు చేశారు. వాస్తవంగా రైతుల వద్ద ఉన్న పత్తినంతటినీ కొనుగోలు చేస్తామని మొదట్లో మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రకటించారు. అయితే.. గత నెలలోనే పత్తిని కొనుగోలు చేయడాన్ని సీసీఐ అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా కేంద్రాలను ఎత్తివేశారు. దీంతో ఇంకా పొలాల్లోనే పత్తి ఉంచుకున్న రైతులు లబోదిబోమంటున్నారు. మరికొంత మంది రైతులు తమ ఇళ్ల కల్లాల్లో టార్పాలిన్లు కప్పి సీసీఐ కేంద్రాలను మళ్లీ ఏర్పాటు చేస్తారోనని ఆశతో ఉన్నారు. ప్రతి రోజు ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు మంత్రాలయం మార్కెట్ కమిటీల కార్యాలయాల చుట్టూ అదే విధంగా కర్నూలులోని మార్కెటింగ్ శాఖ ఏడీఎం కార్యాలయాల చుట్టూ సీసీఐ కేంద్రాలను మళ్లీ తెరిపించాలని మొర పెట్టుకుంటున్నారు.

ఇదేమి దారుణమంటున్న రైతులు

ఇప్పటి దాకా కర్నూలు జిల్లాలోని 12 చోట్ల సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదోనిలో 7,240 మంది రైతుల నుంచి 1,70,655 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో సీసీఐ కేంద్రాల ద్వారా 4,975 మంది రైతుల నుంచి 98,498 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. కోడుమూరు నియోజకవర్గంలో సీసీఐ కేంద్రాల నుంచి 2,633 మంది రైతుల నుంచి 83,712 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. మంత్రాలయంలో 2,320 మంది రైతుల నుంచి 52,008 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. మొత్తం 4,48,074 క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి సేకరించి 297.91 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. వాస్తవంగా ఉమ్మడి జిల్లాలో రైతులు పండించిన పత్తి 40 లక్షల పైగానే ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అయితే.. సీసీఐ కేంద్రాల్లో అధికారులు రైతుల నుంచి కొనుగోలు చేసింది కేవలం 4 లక్షల క్వింటాళ్ల పత్తి మాత్రమే. మరో 16 లక్షల క్వింటాళ్ల పత్తిని వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇంకా 20 లక్షల క్వింటాళ్ల దాకా పత్తి రైతుల పొలాల్లో, ఇళ్లు, కల్లాల్లో మగ్గిపోతోంది. ఈ పత్తిని కూడా కొనుగోలు చేస్తే తప్ప రైతులు బాగుపడే పరిస్థితి ఏ మాత్రం కనిపించడం లేదు.



ఈ రైతు పేరు నాగేష్. కల్లూరు మండలం పెంచికలపాడు గ్రామం. మూడెకరాల పొలంలో పత్తి పంటను సాగు చేశాడు. ఎకరాకు 8 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుందనుకున్నాడు. 24 క్వింటాళ్లకు సీసీఐ నుంచి రూ.లక్షన్నర దాకా అందుతుందనుకున్నాడు. ఖర్చులు పోను కనీసం రూ.70వేలు మిగులుతుందని ఆశించాడు. పత్తి ఇంకా పొలంలోనే ఉండగా.. పత్తి కేంద్రాలను ఎత్తివేశారనే పిడుగు లాంటి వార్త అందింది. ఇక వ్యాపారులకే అమ్ముకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులు చెప్పడంతో నాగేష్ కుంగిపోయాడు. వ్యాపారులు ఇచ్చేది కేవలం రూ.6వేల నుంచి రూ.6,500 మాత్రమే. సాగు ఖర్చులు కూడా రావని కన్నీరు మున్నీరవుతున్నాడు. ప్రస్తుతం కర్నూలు నంద్యాల జిల్లాల్లో ఖరీఫ్‌లో పత్తిని సాగు చేసిన దాదాపు 2 లక్షల మంది రైతుల పరిస్థితి నాగేష్ మాదిరే ఉంది.



మిగతా 7వ పేజీలో

ప్రజా తీర్పును శిరసావహించాలి

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాతీర్పును వైఎస్ జగన్‌తో పాటు, వైసీపీ నాయకులు శిరసావహించాల్సిందేనని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్ష హోదా అనేది వైఎస్ జగన్ అడిగితే ఇచ్చేది కాదని.. ప్రజలు నిర్ణయిస్తారన్నారు. శనివారం నగరంలోని మౌర్యఇన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..అధికారం ఉంటేనే ప్రజల గురించి పట్టించుకుంటాను, ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాను అని వైఎస్ జగన్ చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ పాలనలో ప్రజలకు మంచి జరిగి ఉంటే గత ఎన్నికల్లో ఒక్క మంత్రి మినహా మంత్రులు ఎందుకు ఓటమి పాలయ్యారని ప్రశ్నించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్ అని అన్నారు. సీమ ప్రాంత అభివృద్ధి, జలాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన ప్రణాళికతో ఉన్నారని వివరించారు. కొందరు రాజకీయ కోణంలో న్యాయస్థానంలో కేసులు వేస్తూ సీమ ప్రగతికి విఘాతం కల్పిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రైతులు, ప్రజలను జలచోరులుగా, దోపిడీదారులుగా చిత్రీకరించి మాట్లాడిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. తన పదవిని కాపాడుకునేందుకే ఆయన రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పరమహంస, నాయకులు జీఎస్ నాగ రాజు, పోలంకి రామస్వామి, విట్టా రమేష్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

దిగజారిన ఎండు మిర్చి ధరలు

క్వింటం గరిష్ఠంగా రూ. 11,816



విక్రయానికి వచ్చిన ఎండు మిర్చి బస్తాలు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎండు మిర్చి ధరలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. శనివారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గత వారంతో పోల్చితే ఎండుమిర్చి ధర క్వింటానికి రూ.2వేలకు పైగా ధర పతనమైంది. మిర్చి సాగు చేసిన రైతులు పతనమైన ధరలను చూసి దిగాలు చెందుతున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు ప్రస్తుతం మార్కెట్‌లో పలుకుతున్న ధరలతో ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త కూలీలు కూడా రాక అప్పుల పాలవుతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. 945 బస్తాలు ఎండుమిర్చి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర క్వింటం రూ. 2000, గరిష్ఠ ధర రూ.11,816, మధ్యధర రూ.8869 పలికింది.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి : డీఆర్వో



డీఆర్వో వెంకట నారాయణమ్మకు అభినందనలు తెలుపుతున్న ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను, పరీక్షల నిర్వాహకులను జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ సూచించారు. శనివారం స్థానిక టౌన్ మోడల్ కాలేజీలో ఇంటర్ పరీక్షలపై వర్క్‌షాప్ కార్యక్రమాన్ని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ మార్చి ఒకటో తేదీ నుంచి జరిగే పరీక్షల్లో ఎక్కడైనా పొరపాట్లు జరిగితే అందుకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 69 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 23,098 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 22,227 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని వివరించారు. ఈ సమావేశంలో డీవీఈఓ పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ లాలెప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ త్యాగం మరువలేం

ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన త్యాగాన్ని మరువలేమని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం నగరంలోని ఏ. క్యాంప్‌లో ఉన్న నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడే ఉన్నఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 178వ వర్ధంతిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసింహారెడ్డి బ్రిటీష్ వారి నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి పోరాడి ప్రాణాలు అర్పించాడని అన్నారు. ఆయన చేసిన త్యాగాన్ని మరువలేమని అన్నారు. ఆయన జీవిత చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నవ్య, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ కేడీసీసీబీ చైర్మన్ విజయ మనోహరి, జిల్లా అధికారులు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రాత్రివేళ రాయబేరాలా?

విజయ డెయిరీ చైర్మన్‌పై ఎమ్మెల్యే అఖిల ప్రియ ఫైర్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి పగలు ప్రెస్‌మీట్లు పెట్టి.. రాత్రివేళల్లో రాయబేరాలు నిర్వహిస్తున్నాడని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆరోపించారు. డెయిరీని తన సొంత ఆస్తిలా భావిస్తున్న ఆయన వ్యవహారశైలిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. శనివారం సాయంత్రం భూమా అఖిల ప్రియ విజయ డెయిరీ కార్యాలయంలో శిరివెళ్ల మాజీ ఎంపీపీ బోయలకుంట్ల శ్రీకాంత్ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. మాచినేనిపల్లె రైతులు ఎస్వీ జగన్మోహన్ రెడ్డిని నిరాకరిస్తే అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, గంగుల మద్దతుతో డెయిరీకి చైర్మన్ అయ్యారన్నారు. కేవలం తన కుర్చీని కాపాడుకునేందుకు సొంత పార్టీకి చెందిన డైరెక్టర్లను కూడా బలి చేస్తున్నాడన్నారు. శిరివెళ్లతో పాటు 3 సొసైటీలను రద్దు చేస్తారనే వార్తలు వస్తున్నాయని, అదే జరిగితే పాల రైతులకు వచ్చే ప్రయోజనాలు ఆగిపోతాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఐదేళ్లుగా నోటీసులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మా అబ్బకు నోటీసులు ఇస్తే మాకు ఇచ్చినట్లా అని అగ్రహించారు. శాంతిభద్రతల దృష్ట్యా శివరాత్రి వరకు ఎలాంటి బోర్డు మీటింగ్‌లు నిర్వహించకూడదని కలెక్టర్, డీసీఓ చెప్పినా బోర్డు మీటింగ్ పెట్టడం ఏమిటన్నారు. ఇదిలా ఉండగా భూమా అఖిల ప్రియ విజయడెయిరీలోకి రంగ ప్రవేశంతో కాసేపు టెన్షన్ వాతావరణం కనిపించింది. ఒకవైపు డెయిరీ చైర్మన్, మరోవైపు భూమా అఖిల ప్రియ ఎదురెదురు గదుల్లో ఉండటంతో ఉత్కంఠ చెలరేగింది.



సమావేశంలో మాట్లాడుతున్న భూమా అఖిల ప్రియ

మయూరంపై మల్లన్న

- టీటీడీ దేవస్థానం తరపున పట్టువస్త్రాలు
- కిక్కిరిసిన పాతాళగంగ ఘాట్
- నేడు రావణ వాహనంపై స్వామి, అమ్మవార్లు



శ్రీశైలం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో వైభవంగా సాగుతున్నాయి. నాలుగో రోజు శనివారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, అమ్మవారు మయూరవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ముస్తాబు చేసి మయూర వాహనంపై కొలువుదీర్చారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం రాజగోపురం నుంచి వెలుపలకి తీసుకొచ్చారు. గంగాధర మండపం నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ఎదుట కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, జాంజ్ పథక్, జానపద పగటి వేషాలు, గొరవయ్యలు, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్పడోలు, తప్పెట్లు, బంజారా నృత్యం, శంఖునాదాలు మార్మోగాయి. ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నందిమండపం వరకు తిరిగి అక్కడి నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం దాకా కొనసాగింది. వేలసంఖ్యలో భక్తులు తరలిరావడంతో శ్రీశైల క్షేత్ర వీధులన్నీ కిక్కిరిశాయి. శివదీక్షాపరులు పవిత్ర పాతాల గంగలో పుణ్యస్నానాలు అచరించి భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు రావణవాహన సేవ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలో భాగంగా ఐదవరోజు శనివారం సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లుకు రావణవాహన సేవ, గ్రామోత్సవం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం తరుపున శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

టీటీడీ, కాణిపాకం నుంచి పట్టువస్త్రాల సమర్పణ

శ్రీశైలంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ఈఓ కె.పెంచలకిషోర్ తోపాటు ఆస్థానాచార్యులు ఫణికుమారశర్మ, అర్చకులు గణేష్‌గురుకుల్ స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. రాత్రి తిరుమల తిరుపతి దేవస్థానం ఈఓ జె.శ్యామలరావు దంపతులు భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలతో వచ్చిన వీరికి శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకస్వాములు పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లన్నకు పట్టువస్త్రాలు సమర్పించడం పూర్వజన్మ సుకృతమని టీటీడీ ఈఓ అన్నారు.






వివిధ వేషధారణలో కళాకారులు



గిరిజన నృత్యం చేస్తున్న మహిళలు

తుంగభద్ర
సాహిత్యం



పూలనిప్పులుతో ప్రయాణం

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'అస్తిత్వానికి ఆసరాగా, బతుక్కి భరోసాగా నిలిచింది కవిత్వం. అవును...బాధలకు బాసటగా ఉండటంలోనే సాహిత్య లక్ష్యం నెరవేరింది...బతకడానికి తెగింపు నిచ్చే అస్త్రాల కుప్పలు.. అదే నేను రగిలించిన ఈ 'పూలనిప్పులు' అంటారు రచయిత్రి స్వయంప్రభ. ఆమె రాసిన పూలనిప్పులు ఇటీవల కాలంలో సాహితీ విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంది. జిల్లా నుంచి చక్కని కవిత్వాన్ని 'మధుమాస వీణ' అనే కలం పేరుతో అనతికాలంలోనే గొప్ప కవయిత్రిగా పేరు తెచ్చుకుంటున్నారు స్వయంప్రభ. ఆమె సాహిత్యం చదవలేదు. కేవలం పాఠశాల విద్యవరకే చదువుకున్న ఆమె గొప్పగా కవిత్వం రాస్తున్నారు. తనలోని ఆధునిక స్వతంత్ర ఆలోచనలు స్వయంప్రభ జీవనయానంలోని అనేక సంఘర్షణలు తనతో కవిత్వం రాయిస్తున్నాయేమో అనిపిస్తుంది. పూలనిప్పులు కవితా సంపుటిలో 67 కవితలు ఉన్నాయి. అవన్నీ వేటికవే ప్రత్యేకంగా నిలుస్తాయి. తొలి కవితలో 'కష్టాన్ని నమ్ముకుని కన్నీళ్లు దాచుకొని, పరువు విత్తనాలు భూగర్భాన దాచిపెట్టి, చిగురుటాకుల కోసం ఎదురుచూసే శిశిరాన్ని విడిచిన వసంతకాలం, ఆకలి పస్తులకు ఆప్తబంధువులం, ప్రపంచానికి ఆకలి తీర్చే రైతులం' అంటూ బీటలు వారిన దేహంలోని రైతు కష్టాలను కళ్లముందు ఉంచారు. సగటు మహిళ జీవితంలోని సంఘర్షణలకు, సంక్లిష్టతలకు నిదర్శనంగా మది కల్లోలం అంటూ 'ప్రశాంతతకు నలుదిక్కుల వెతికినా...కంటికెక్కడ కనిపించలేదు....అన్వేషించాల్సింది బాహ్య ప్రపంచంలోనే కాదు...హృదయాంతరంగంలోనేనని' అంటారు. ప్రముఖ కవి శివారెడ్డి అన్నట్లు శబ్దంతోనో, నిశ్శబ్దంగానో మాటలో మాటై, మనిషి ప్రయాణం చేస్తాడు. ప్రభ కవిత్వం కూడా 'ప్రశ్నిస్తే మారదు సమాజం, ఆచరణాత్మక అడుగులేస్తేనే, మొదటి అడుగు నీదైతే, మరో అడుగు సమాజానిది, వాస్తవమే వేల మాటలేల ఒక్క అడుగు ఆచరణలో చూపు' అంటారు. ఇలా ఈ పుస్తకంలోని కవితలన్నీ వస్తు ప్రధానమై, వివక్ష, మోసం లేని వ్యవస్థ కోసం, ఆర్తితో ప్రేమైక జీవన స్వప్నాల కోసం, చీకటిని చీల్చే ఉషోదయ కిరణాల కోసం రాసినట్లుగా ఉంటాయి. 'నా అక్షరాలు దీన స్వరాలు కాదు/ చైతన్యాన్ని పెంచే ధిక్కార స్వరాలు' అంటూ తన కవితాయానంలో ప్రతిఘటన శరాలు సంధిస్తూ సాగుతున్నారు. ఈ పుస్తకం అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలల్లో లభిస్తుంది.



- ఎన్. నాగమణి,
ప్రభుత్వ ఉపాధ్యాయురాలు,
ఎమ్మిగనూరు

భారతావని భవిత

భారతావని భవిత కోసం...
భిన్నమైన వాదాలను పక్కన పెడదాం
ఈ వసుధైక కుటుంబంలో...
భిన్నత్వంలో ఏకత్వమై
ఓ యువతా ముందడుగు వేద్దాం...!

విశాల భారతం...అనంత సోయగం
హిమగిరులు, జలపాతాలు
గంగా త్రివేణి సంగమాలు...
అబ్బురపరిచే మహారణ్యాలు,
కాశ్మీరం నుంచి
కన్యాకుమారి వరకు
ఈ సువిశాల దేశం సంస్కృతి
సమాహారాల క్షేత్రం
ఓ నవతా ప్రణమిల్లుదాం
మన సంప్రదాయాలకు..!

దేశాన్ని రక్షించే సైనికులు ఎందరో
దేశానికి అన్నం పెట్టే కృషీవలురు
మరెందరో
కార్మికుల శ్రమ జీవనానికీ...శ్రమజీవుల
కష్టార్జితానికి
ఓ యువతా చేద్దామా నిత్య వందనం...!

కులమతాలను దాటి...జాతి విద్వేషాలు
వీడి
ప్రాంతీయ అసమానతా భేదాలు వదలి
మానవీయ విలువలతో, సేవా సహకార
భావాలతో
పుడమి తల్లి రుణం
తీర్చేందుకు, పుణ్యభూమిలా
నిలిపేందుకు
ఓ నవ యువతా వేద్దామా
చైతన్యపూరిత
అడుగులు...!!



-యు. స్రవంతి,
కర్నూలు



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు నోటిఫికేషన్

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని 29 మోడల్ స్కూళ్లలో 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఇన్‌చార్జి డీఈఓ ప్రేమంత్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 29 మోడల్ స్కూళ్లలో ఈనెల 25వ తేదీ నుంచి మార్చి 31వతేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 20వతేదీన ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఐదవ తరగతి స్థాయిలో ఉండే ఈ పరీక్షను తెలుగు లేదా ఇంగ్లీష్ మీడియంలో రాయవచ్చన్నారు. పరీక్ష అనంతరం ఏప్రిల్ 27వతేదీన మెరిట్ లిస్ట్ విడుదల, అదే రోజున సెలక్షన్ లిస్టు ప్రకటించడం జరుగుతుందన్నారు. 30వతేదీన సర్టిఫికెట్ వెరిఫికేషన్, కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు.


పిల్ల చేష్టలా..?



భూమా అఖిలప్రియపై విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్ ఆగ్రహం

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 'డీ ఫాల్టర్‌కు మేమెందుకు సమాధానమివ్వాలి.. ఏంటి పిల్ల చేష్టలా...' అంటూ విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్ రెడ్డి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన డెయిరీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వ్యవహరిస్తున్న తీరు దొంగే దొంగ అన్నట్లు ఉందన్నారు. విజయడెయిరీకి భూమా జగత్‌కు చెందిన డెయిరీ రూ.1.20 కోట్లు బకాయి పెట్టిందన్నారు. ఎన్నిసార్లు నోటీసు ఇచ్చినా స్పందించలేదన్నారు. డెయిరీకి వచ్చినప్పుడు ఆమెతీరు బాగోలేదన్నారు. ఆడబిడ్డ కాబట్టి ఏమీ అనలేకపోతున్నానన్నారు. మరో చోట అయితే మెడ పట్టి గెంటేస్తారన్నారు. జగత్ డెయిరీ వల్ల విజయ పాలసేకరణ లక్ష లీటర్ల నుంచి 70 వేలకు పడిపోయిందన్నారు. తన హయాంలో డెయిరీ టర్నోవర్‌ను రూ.320 కోట్లకు పెంచటంతో పాటు రైతులకు రూ.15 కోట్ల బోనస్ ఇచ్చామన్నారు. శిరివెళ్ల, తదితర సొసైటీలను రద్దు చేయడం వల్ల రైతులకు ఎలాంటి నష్టం ఉండదని స్పష్టం చేశారు. ఈ రోజు తాము నిర్వహించిన బోర్డు మీటింగ్‌కు కోరం ఉందని తెలిపారు. మేము తప్పు చేశామని అనిపిస్తే కోర్టు వెళ్లవచ్చని భూమా అఖిల ప్రియనుద్దేశించి అన్నారు. ఈ సమావేశంలో చైర్మన్‌తో పాటు ఎండీ ప్రదీప్ కుమార్, బోర్డు సభ్యులు ఉన్నారు.

తొలి తరం నవలా రచయిత శిష్టు



శిష్టు కృష్ణమూర్తి

- కవిత్వం, కథా ప్రక్రియల్లోనూ విశేష కృషి
- 67 ఏళ్ల అలుపెరుగని సాహితీ ప్రస్థానంలో కృష్ణమూర్తి



'శ్యామల' నవల

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):

'నన్ను కదిలించకండి... నేను
సమాజ సంక్షేమాన్ని కాంక్షించి
నిశ్శబ్దంగా ఏకాంతపు మసీదులో
నమాజు చేస్తున్నాను..!
నవ చైతన్య గంగా స్రవంతిని
ప్రజల మధ్యకు మళ్లించ
తపస్సు చేస్తున్నాను..!
భావి సమాజ శిల్పానికి
ఉత్తమోత్తమ రూపకల్పన
చేయడానికి
నిరంతర యత్నం చేస్తున్నాను...!!'
- శిష్టు కృష్ణమూర్తి


శిష్టు కృష్ణమూర్తి రాసిన కవిత్వంలో ఆలోచనా విధానం ప్రతిబింబిస్తుంది. ఆయన అరవై ఏడేళ్లుగా అలుపెరుగని సాహితీ ప్రస్థానం సాగిస్తున్నారు. ఆయన రాసింది తక్కువే అయినా, వాసిలో అనన్య ఖ్యాతిని సంపాదించారు. కవిత్వం, కథలు రాసినా కర్నూలు జిల్లా నవలా చరిత్రలో తొలి తరానికి చెందిన రచయితగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒక పరిశోధన విద్యార్థి కూడా ఆయన నవలలపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా కూడా పొందారు.

సాహిత్యాభిలాషను పెంచిన 'వసుచరిత్ర'


ఉమ్మడి జిల్లాలోని సిరివెళ్ల మండల పరిధిలోని గుంపరమానుదిన్నె గ్రామంలో 1935లో లలితమ్మ, వెంకట సుబ్బయ్య దంపతులకు జన్మించిన కృష్ణమూర్తి వెలుగోడు, చాగలమర్రి, ఆళ్లగడ్డలలో ప్రాథమిక విద్య చదువుకున్నారు. ఆళ్లగడ్డలో 1954లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తయ్యాక కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేక రెండేళ్లు ఇంటి వద్దే వ్యవసాయ పనులు చేస్తూ ఉండి పోయారు. ఆ సమయంలో విరివిగా సాహిత్యం చదివారు. ఆయనకు దొరికి పుస్తకం 'వసు చరిత్ర' ఆయనలో ఎంతో ప్రభావితం చూపించింది. అష్టదిగ్గజ కవులుగా పేర్కొనే రామరాజ భూషణుడు రాసి ఈ పుస్తకాన్ని లెక్కలేనన్నిసార్లు చదివారు. ఉన్నత విద్యకోసం తిరిగి కడప జిల్లా కేంద్రానికి వెళ్లి 1957లో ఇంటర్ ఉత్తీర్ణులయ్యారు. ఇంటికి వచ్చాక మళ్లీ ఆర్థిక ఇబ్బం దులు ఎదుర య్యాయి. దీంతో తాత్కాలిక ఉద్యోగ ప్రయత్నం కోసం హైదరాబాదు చేరుకొని, అక్కడి సచివాలయంలోని రెవెన్యూ బోర్డులో తాత్కాలిక ఉద్యోగాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన తన కలానికి పదును పెట్టారు. 'ఫ్లవర్స్ టు గాడ్' అన్న పుస్తకాన్ని రాశారు. చిన్న చిన్న కవితలు తెలుగు, ఆంగ్ల భాషల్లో రాస్తూ సాహిత్యంపై పూర్తిగా దృష్టి పెట్టారు.

మలుపు తిప్పిన ఉద్యోగ జీవితం...

హైదరాబాదులోని సహకార శాఖలో జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరిన శిష్టు కృష్ణమూర్తికి రాధాకృష్ణమూర్తి అనే సాహితీ మిత్రుడు తోడయ్యాడు. అలా తొలిరోజుల్లో చలం, గోపీచంద్, నండూరి, బుచ్చిబాబు పుస్తకాలు చదివారు. టాగోర్ రాసిన గీతాంజలిని తెలుగులోకి అనువదించారు. ఈ అనువాద కవిత్వం అప్పట్లో కర్నూలులో ప్రచురితమవుతున్న 'ఉజ్వల' వార పత్రికలో ధారావాహికగా అచ్చయ్యింది. ఆనాటి రచయితలు శీలా వీర్రాజు, మంత్రిప్రగడ వీరభద్రమూర్తి పరిచయం, ప్రోత్సాహంతో 'ఎంకి పాటలు' రాశారు. అవి విశేష ఆదరణ పొంది హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో ప్రసారమయ్యాయి.



జీవన ఘోష నవల



మనసు గతి నవల

జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘంలో..

కర్నూలుకు బదిలీపై వచ్చిన కృష్ణమూర్తికి ఉజ్వల పత్రిక అధినేత మనోహర్, రచయితలు కేఎన్ఎస్ రాజు, భారతుల శివరామకృష్ణ పరిచయం అయ్యారు. కర్నూలు గ్రామీణ మహిళల ఇతివృత్తంగా 'శ్యామల' నవల రాశారు. దీన్ని 1969లో ఎమెస్కో వారు ప్రచురించారు. 'బండ కోసం కొండ కూలింది', 'వేషం వెనుక', 'వైధవ్యం' వంటి కథలు ప్రాముఖ్యత పొందాయి. ఫ్రాయిడ్ మనో విశ్లేషణ సిద్ధాంతాన్ని పునాదిగా 'జీవన ఘోష' నవల రాశారు. 'మనసు గతి' అనే మరో నవల కూడా ప్రాచుర్యం పొందింది. 1973లో కర్నూలు జిల్లా రచయితల ప్రచురణ సహకార సంఘం ఏర్పాటు చేసి ఎందరో రచయితల పుస్తకాలు అచ్చువేయడంలో ముఖ్య భూమిక పోషించారు. 'మహాదాశయం' అనే కవితా సంకలనంలో సామాజిక దురాచారాలపై ధ్వజమెత్తారు. జిల్లాలో కరువు పీడిత రైతాంగ జీవనాన్ని చిత్రించే కథలతో కేఎన్ఎస్ రాజుతో కలిసి 'శాపగ్రస్తులు' అనే సంకలనాన్ని ప్రచురించారు.

నాటకానికి బీసీ కృష్ణ సేవలు చిరస్మరణీయం

రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా నాటక రంగానికి నటుడు, గాయకుడు, దివంగత బీసీ కృష్ణ చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి కొనియాడారు. శనివారం నగరంలోని మద్దూరునగర్‌లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో ఇటీవల మృతి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు బీసీ కృష్ణ సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత కళాకారులు బీసీ కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సావిత్రి మాట్లాడుతూ కళాకారులు తమ వృత్తిపట్ల నిబద్ధతతో ఉండాలని అన్నారు. అలాంటి వారిని సమాజంలో అందరూ ప్రోత్సహించాలని అన్నారు. ఏ రంగంలోనైనా అంకితభావంతో పనిచేసే వారికి ఉన్నత శిఖరాలు ఎక్కే అవకాశం లభిస్తుందని అన్నారు. మరో అతిథి ఏపీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషా మాట్లాడుతూ బీసీ కృష్ణ వంటి గొప్ప కళాకారుడు దూరం కావడం బాధాకరమని అన్నారు. సభాధ్యక్షత వహించిన సాహితీవేత్త జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ బీసీ కృష్ణ పేరుతో ఏటా అవార్డు ప్రదానం చేసేందుకు రూ.లక్ష అవార్డు నిధిని సేకరిస్తే బాగుంటుందని సూచించారు. సీనియర్ రంగస్థల నటుడు, నంది అవార్డు గ్రహీత గుర్రపుశాల అంకయ్య మాట్లాడుతూ బీసీ కృష్ణ పేరుతో అవార్డు నెలకొల్పితే ఆయన పేరు శాశ్వతంగా నిలిచిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, సీనియర్ నటులు పి. దస్తగిరి, హెచ్. చంద్రన్న, వీవీ రమణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, రమేష్‌కుమార్, ఇబ్రహీం, సిరాజ్, టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పి. హనుమంతరావు చౌదరి, బైలుప్పల షఫీయుల్లా, విశ్రాంత తహసీల్దార్లు సయ్యద్ రోషన్ ఆలీ, సీబీ అజయ్‌కుమార్ తదితరులు బీసీ కృష్ణకు నివాళులు అర్పించారు.



ప్రముఖ రంగస్థల నటుడు బీసీ కృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, కళాకారులు

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

సిల్వర్ జూబ్లీ కళాశాలలో రేపటి నుంచి జాతీయ సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపకులపతి

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'గ్రామీణ సమాజ సాధికారత-ఉపాధి అవకాశాలు' అనే అంశంపై ఈనెల 24, 25న సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు. శనివారం క్లస్టర్ వర్సిటీలోని వీసీ చాంబర్లో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సహకారంతో అర్థశాస్త్ర ఆధ్యాపకులు డాక్టర్ జి.ఎల్లకృష్ణ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సదస్సుకు అధిక సంఖ్యలో పరిశోధకులు, ఆధ్యాపకులు పాల్గొని గ్రామీణ సమాజ సాధికారత నెరవేరేందుకు అవసరమైన సూచనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్, బీఆర్ ప్రసాద్‌రెడ్డి, నాగరాజు శెట్టి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలు

- ఐదు, జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- వచ్చే నెల 6 తేదీ వరకు గడువు




ఆలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో బోధించేందుకుగాను 2025-26 ఏడాదికిగాను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ప్రక్రియ ఆరంభం అయ్యింది. 5వ తరగతిలో ఒకసారి ప్రవేశం పొందితే ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య, వసతిని పొందే అవకాశం ఉంటుంది. ఐఐటీ, నీట్ అకాడమీ శిక్షణతో కూడిన ఇంటర్ ప్రవేశాలకు వచ్చే నెల మార్చి 6వ తేది వరకు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 డా. బీఆర్ గురుకుల బాలుర, బాలికల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలోని అరికేర, సి బెళగల్, చిన్నటేకూరు, నంద్యాల జిల్లాలో జూపాడుబంగ్లా, డోన్ ప్రాంతాల్లో బాలుర ఎస్సీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో డోన్, ఆళ్లగడ్డ రెగ్యులర్, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, కర్నూలు జిల్లాలో కంబాలపాడు, వెల్దుర్తి, దిన్నెదేవరపాడు, లక్ష్మాపురం ప్రాంతాల్లో ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 8,575 మంది చదువుతున్నారు. చిన్నటేకూరులో సైతం బాలుర ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐఐటీ, నీట్‌కు అకాడమీ కోచింగ్ ఇస్తారు. ఈ గురుకులంలో 2023-24 ఏడాదిలో మెడికల్ సీట్లకు 60 మంది రాస్తే 20 మందికి, ఐఐటీ, ఎన్ఐటీలలో 41 మందికి సీట్లు వచ్చాయని జిల్లా డీసీవో శ్రీదేవి తెలిపారు.

దరఖాస్తు చేసేందుకు నిబంధనలు

ఐదో తరగతిలో చేరికకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2012 సెప్టెంబరు ఒకటి నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించాలి. ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్ (బీసీ-సీ) విద్యార్థులు 2014 సెప్టెంబర్ ఒకటి నుంచి 2016 ఆగస్టు31 మధ్య పుట్టి ఉండాలి. జూనియర్ ఇంటర్‌లో చేరికలకు 2024-25 ఏడాదిలో పదో తరగతి పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులు. 5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు విద్యార్థి తల్లిదండ్రులకు ఏడాదికి ఆదాయం రూ.1 లక్షకు మించకూడదు. 5వ తరగతి ప్రవేశం కోసం హెచ్ఐటీటీపీ/ఏపీబీఆర్ఏజీసీఇటీ, ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్, ఇంటర్‌కు సంబంధించి హెచ్‌టీటీపీ/ఏపీబీఆర్ఏజీసీఐటీ ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్-ఇంటర్నెట్‌లో దరఖాస్తులు చేయాలి. ఒక్కో పాఠశాలలో ఐదు తరగతికి 80 సీట్లు, కళాశాలల్లో జూనియర్ ఇంటర్‌లో 80 సీట్లు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. జూనియర్ ఇంటర్ డోన్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల మినహాయిస్తే 14 కళాశాలల్లో 1,120సీట్లు, ఐదో తరగతికి సంబంధించి 15 పాఠశాలల్లో 1200 సీట్లు ఉంటాయని అధికారులు తెలిపారు.

దరఖాస్తు చేసేందుకు అవసరమైనవి

విద్యార్థి వివరాలు తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలని నమోదు సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తెల్లరేషన్ కార్డు, ఇంతకు ముందు తరగతికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. సెల్ నంబరు తప్పు లేకుండా నమోదు చేయాలి. ప్రతిభా పరీక్షలో మెరిట్ జాబితా ప్రకారం, నేరుగా సీటు కేటాయిస్తారు.




గురుకులం విద్యార్థులు, క్రీడలు ఆడుతున్న విద్యార్థులు

గురుకులంలో ప్రవేశాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం



ప్రతి ఏటా 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి ప్రవేశ పరీక్షకు హాజరు కావాలి. ప్రతిభ ఆధారంగా సీటు కేటాయిస్తాం. ఐదో తరగతి పిల్లలందరికీ సీటు రావడానికి 4వ తరగతి సిలబస్ వరకు చదివించాలి. ఇంటర్ వారికి పదో తరగతి సిలబస్ చదవాలి. నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశాల కోసం గ్రామీణ ప్రాంతాల్లో కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నాం. గురుకులంలో అందించే విద్యా వసతి, మెనూ, ఆటలు వంటి వాటి గురించి తెలియజేస్తున్నాం. ఒకసారి 5వ తరగతిలో ప్రవేశం పొందితే ఇంకా ఇంటర్ వరకు అక్కడే ఉచితవిద్యను పొందవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలి. అవకాశాన్ని సద్వినియోగించుకోవాలి.

- మనేరాజు, ప్రిన్సిపాల్, అరికేర డా బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల, ఆలూరు మండలం



ఎండలు దంచి కొడుతున్నాయి. తాగుదామంటే.. సమీపంలో నీళ్లు కూడా లేవాయే. హా..వాటర్ బాటిల్ దొరికింది. వాటర్ బాటిల్ మూత తీసి ఎలా తాగాలి.. మూత తీయడమెలా?



మూత తీయడం చాలా కష్టమే. ఎలాగబ్బా..



హమ్మయ్య ఎట్టకేలకు వాటర్ బాటిల్ మూత తీసేశా. బాటిల్‌లో నీరు ఉంది.. ఎలా తాగాలబ్బా..



అయ్యో బాటిల్ నుంచి నీళ్లు కిందపడిపోయాయే. బ్యాడ్ టైమ్.

నీటి కో(తి)సం..!

ఫిబ్రవరి మాసం పూర్తికాకనే ఎండలు దంచికొడుతున్నాయి. తాగునీటి ఇబ్బందులు ఈ నాలుగు నెలలు ఎదుర్కోవడం మనుషులకే కాదు.. మూగజీవాలకు కూడా కష్టమే. శనివారం కోసిగి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఓ వానరం తాగునీటి కోసం పడుతున్న కష్టాలు వేసవితాపానికి అద్దం పడుతున్నాయి.

- కోసిగి (ఆంధ్రజ్యోతి)



అయినా పర్లేదు.. హమ్మయ్యా దాహం తీరింది.

మూతపడ్డ సీసీఐ కేంద్రాలు

(5వపేజీ తరువాయి)

దాదాపు లక్షన్నర మంది రైతులు తమ వద్ద ఉన్న పత్తిని సీసీఐ అధికారులకు అమ్ముకునేందుకు మార్కెటింగ్ శాఖ అధికారుల కార్యాలయానికి క్యూ కడుతున్నారు. ఎలాగైనా పత్తిని కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు అమ్మించాలని సీసీఐ కేంద్రాలను వెంటనే తెరిపించాలని లేకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని అధికారులను కోరుతున్నారు. అయితే.. మార్కెటింగ్ శాఖ అధికారులు మాత్రం రైతుల వద్ద మిగిలి ఉన్న పత్తి నాణ్యత లేదని, అందువల్ల సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు. దీంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

పత్తి ఇంట్లోనే మగ్గుతోంది



నాకు 12 ఎకరాల పొలం ఉంది. పత్తిని అమ్ముకుందామంటే సీసీఐ కేంద్రాలను చెప్పా పెట్టకుండా మూసేశారు. వ్యాపా రులు ఇదే అదునుగా క్వింటానికి రూ.6వేల నుంచి రూ.6,500 మాత్రమే చెల్లిస్తామంటు న్నారు. సీసీఐ కేంద్రాలు మళ్లీ తెరుస్తారేమోనన్న ఆశతో పత్తిని ఇంట్లోనే నిల్వ చేసుకున్నాను. సీసీఐ కేంద్రాలు తెరుస్తారని ఎదురు చూస్తున్నా.

- హనుమంతు, పెంచికలపాడు, రైతు



రైతుల వద్ద ఉన్న పత్తి నాణ్యంగా లేదు

ప్రస్తుతం రైతుల వద్ద ఉన్న పత్తి నాణ్యంగా లేకపోవడం వల్లనే సీసీఐ అధికారులు కొనుగోలు చేసేందుకు కేంద్రాలను కొనసాగించలేకపోతున్నారు. మాకు వారిపై ఎటువంటి అధికారం లేదు. రైతుల ఒత్తిడి మేరకు ప్రభుత్వానికి సీసీఐ కేంద్రాలను తెరిపించేం దుకు నివేదికను పంపిస్తాం. **- నారాయణమూర్తి, ఏడీఎం**

ధ్రువీకరణ పత్రాలను జాగ్రత్తగా జారీ చేయండి

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జనన, మరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీలో అధికారులు జాగ్రత్తలు వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. లీలా వెంకట శేషాద్రి సూచించారు. స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో రెవెన్యూ, పంచాయతీ, రిజిస్ట్రేషన్, మున్సిపల్ అధికారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ వివాహ చట్టం-1955, ప్రత్యేక వివాహ చట్టం-1945ల ప్రకారం వివాహ ధృవీకరణ పత్రాలను కూడా జాగ్రత్తతో జారీ చేయాలని ఆయన తెలిపారు. కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ మాట్లాడుతూ కుల ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్న 15 రోజుల్లోపు వాటిని మంజూరు చేస్తామన్నారు. కోడుమూరు తహసీల్దార్ వెంకటేశ్ నాయక్ మాట్లాడుతూ ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం గ్రామాలలో అయితే.. నెలసరి ఆదాయం రూ.10వేలు లోపు ఉండి, పట్టణాల్లో అయితే.. నెలసరి ఆదాయం రూ.12వేలు లోపు ఉంటే వాటిని జారీ చేస్తామని తెలిపారు. కర్నూలు మున్సిపల్ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ మాట్లాడుతూ మరణ, జనన ధృవీకరణ పత్రాలను నమోదు చేసుకున్న 7 రోజులలోపు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, ఆరోగ్య అధికారి విశ్వనాథ్ రెడ్డి, రిజిస్ట్రేషన్ శాఖ అధికారి ఈశ్వరయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.లీలా వెంకట శేషాద్రి

ప్రశ్నపత్రం తారుమారు..

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ సప్లమెంటరీ 4వ సెమిస్టర్ పరీక్షలో శనివారం గణితం పరీక్ష ప్రశ్నపత్రం తారుమారైంది. జిల్లాలోని 14 పరీక్షా కేంద్రాల్లో ఈనెల 9న పరీక్షలు మొదలయ్యాయి. 4వ సెమిస్టర్ ప్రశ్నప త్రంలో పాత సిలబస్ రావడంతో డోన్ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ఫిర్యాదు మేరకు యాజమాన్యం హుటాహుటిన ఆర్‌యూ పరీక్షల విభాగానికి ఫిర్యాదు చేశారు. వెంటనే పరీక్ష కేంద్రాల్లో రిజర్వులో ఉంచిన మరో పరీక్షా పత్రం పంపిణీ చేయాలని సూచించారు. గంట ఆలస్యం కావడంతో సమయాన్ని పొడిగించారు. పరీక్షల విభా గం కంట్రోలర్ వెంకటేశ్వర్లు దృష్టికి తీ సుకె ళ్లగా పరీక్ష యధావిధిగా కొనసాగిందన్నారు.

వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి



ఆస్పరిలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య

- సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య

ఆస్పరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టబోయే 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో వేద వతి ప్రాజెక్టు నిర్మాణానికి 1000 కోట్లు నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ రాష్ట్రం, జిల్లాలో అత్యంత వెనుకబడిన ఆలూరు అభివృద్ధికి 8 టీఎంసీలతో వేద వతి రిజర్వాయర్ నిర్మాణం తప్పనిసరి అన్నారు. 2018లో వేదవతి రిజర్వాయ ర్‌ను నిర్మిస్తామని కోడు మూరులో చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఈనెల 28న కూటమి ప్రభు త్వంలో పూర్తిస్థాయి రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశ పెడుతున్నందున ఈ సమావేశా ల్లోనే వేదవతి ప్రాజెక్టుకు రూ. 1000కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్య దర్శి విరుపాక్షి, బంత్రోతు శీను, మారెన్న, వెంక టేష్, బాబు, మల్లేష్ పాల్గొన్నారు.

రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు

- జిల్లా పరిషత్ సీఈవో జి. నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంగ్లేయుల పాలిట సింహస్వప్నంగా నిలిచిన రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి అన్నారు. శనివారం నరసింహారెడ్డి జయంతిని పురస్కరించుకుని జడ్పీ మినీ సమావేశ భవనంలో ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమన్నారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సీసీ ప్రసాద్, పరిపాలన అధికారులు సరస్వతమ్మ, పుల్లయ్య, నాగేంద్రప్రసాద్, బసవశేఖర్, సిబ్బంది రామచంద్రమూర్తి, సిద్దారెడ్డి, మాధవి, , తిరుమలేశ్వరరెడ్డి, పుష్పావతి, జి.మాధవి, కళ్యాణి, కౌసల్య, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ.గఫూర్



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ.గఫూర్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికవర్గం ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ.గఫూర్ పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన కేకే భవన్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ సమాజాన్ని చీలిచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

మైనార్టీలపై దాడులు చేస్తూ మైనార్టీలకు రక్షణ లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులను కట్టుబానిసలుగా మార్చేవిధంగా లేబర్‌కోడ్‌లను మార్పులు చేర్పులు చేయడం సరికాదని హెచ్చరించారు. కార్మిక హక్కుల కోసం సీఐటీయూ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. ఏప్రిల్ నెలలో రాష్ట్రస్థాయి సీఐటీయూ కార్యకర్తల వర్క్‌షాపు నగరంలో నిర్వహి స్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు రామాంజనేయులు, ఈరన్న, సాయిబాబ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధార్ తప్పనిసరి

- జిల్లా పరిషత్ సీఈవో

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ కార్డు తప్పకుండా ఉండాలని, ఆ కార్డులను వేగవంతంగా అందజేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా పరిషత్ నుంచి కర్నూలు,ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, సీడీపీఓ, ఐసీడీఎస్, సూపర్‌వైజర్లతో గూగుల్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు ఆధార్ అప్‌డేట్ చేసేందుకు సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సమన్వయం చేసుకోవాలన్నారు. అదే విధంగా మిస్సింగ్ సిటిజన్ల సర్వే వేగవంతం చేయాలన్నారు.



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న సీఈవో నాసరరెడ్డి

గోడ కూలి వ్యక్తి దుర్మరణం



ప్రమాదానికి కారణమైన గోడ



కోసిగి క్రిష్టప్ప(ఫైల్

కౌతాళం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మదిరె గ్రామానికి చెందిన కోసిగి క్రిష్టప్ప(61) తాపి పనులకువెళ్ళినప్పుగు ప్రమాదవశాత్తు గోడ కూలి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన శనివారం జరిగింది. మదిరె గ్రామానికి చెందిన కోసిగి క్రిష్టప్ప గ్రామంలో కూలి పనులు చేసుకొని జీవిస్తున్నాడు. గ్రామంలో ఒక ఇంటి గోడను తొలగించేందుకు తోటి కూలీలతో పాటు పనికి వెళ్ళాడు. అక్కడ ఉన్న ఫలంగా ఇంటి గోడ కూలడంతో పక్కనే పని చేస్తున్న క్రిష్టప్పపై రాళ్ళు పడిపోవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. తోటి కూలీలు రాళ్ళను తొలగించి క్రిష్టప్పను వెలికి తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య దేవమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

బ్రహ్మ కుమారీస్ సంస్థ నుంచి మైలా రాధాకృష్ణ తొలగింపు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కర్నూలు సేవా కేంద్రం ఓర్వకల్లు శాఖలో పనిచేస్తున్న మైలా రాధాకృష్ణ అనే వ్యక్తిని తొలగించినట్లు కర్నూలు కేంద్రం ఇన్‌చార్జి లీలా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ కార్యకలాపాలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్ల ఆయన్ను విధుల నుంచి శాశ్వతంగా తొలగించామన్నారు. అయినప్పటికీ రాధాకృష్ణ బ్రహ్మకుమారీస్ సంస్థ పేరు చెప్పుకుంటూ సత్సంగాలు, బహిరంగ సభలను నిర్వహిస్తున్నాడని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు, భక్తులు ఈ విషయాన్ని గుర్తించాలని సూచించారు. 'ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంస్థ' నిబద్ధతతో కూడుకున్న సంస్థ అని, ఈ సంస్థ అంతర్జాతీయ ముఖ్య కేంద్రంలో మౌంట్ అబూ రాజస్థాన్‌లోనూ, జోనల్ కార్యాలయం బెంగుళూరులోనూ ఉందని లీరా తెలిపారు.

జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలు

- ఎస్పీకి ఏపీయూడబ్ల్యూజే ఫిర్యాదు



డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నిజాల నిర్భయంగా రాసే జర్నలిస్టులపై కొంతమంది పోలీసు అధికారులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఏపీయూడబ్ల్యూజే నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఐజేయూ సభ్యులు గోరంట్ల కొండప్ప, కె.నాగరాజు, ఏపీయూడ బ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసగౌడ్ ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. పత్తికొండ, ఆదోనితో పాటు పలు ప్రాంతాల్లో జర్నలి స్టులపై కొందరు పోలీసులు అనుచితంగా వ్యవహరిస్తూ అక్రమ కేసులు నమోదుకు పాల్పడుతున్నారన్నారు.

డైరీ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 2025 డైరీని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆవిష్కరించారు. జర్నలిస్టులు అంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా నేరుగా వచ్చి కలవచ్చని అన్నారు. పోలీసులు తప్పకుండా జర్నలిస్టులకు అండగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐలు గౌస్, శ్రీనివాస్ నాయక్, యూనియన్ నాయకులు అంజి, శివరాజ్ కుమార్, మధు, అశోక్‌గౌడ్, మస్తాన్, భాస్కర్, మద్దిలేటి, మధు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టండి: ఆర్డీవో



కాల్వబుగ్గ మహాశివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో సందీప్ కుమార్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరిగే మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ అన్నారు. శనివారం కాల్వబుగ్గలో మహాశివరాత్రి ఏర్పా ట్లపై అధికారులతో మాట్లాడారు. ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. చిన్న కోనేరు, పెద్ద కోనేరు, ఆలయం క్యూలైన్లు, తదితర మౌలిక వసతులను పరిశీలించారు. ఎండలు అధికంగా ఉండటంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా షామియానాలు ఏర్పాటు చేసుకోవాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం శివునికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మద్దిలేటి, ఎంపీడీవో శ్రీనివాసులు, సర్వే డీటీ, షర్మిళారెడ్డి, ఫెస్టివల్ కమిటి సభ్యులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, భక్తులు బజారు, నాగభూషణంశెట్టి, వేణు, కేవీ మధు, జయకృష్ణ పాల్గొన్నారు.

జర్నలిస్టులు సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ



కార్యక్రమంలో పాల్గొన్న సమాచార శాఖ డీడీ జయమ్మ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి సాంబశివ

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను వినియోగించు కోవాలని సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ సూచించారు. శనివారం సమాచార శాఖ ఆవరణలో ఏపీ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈశ్రమ్ కార్డు ప్రయోజనాలు వర్తించే బీమా నగర కమిటీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏపీడబ్ల్యూజేఎస్ నగర అధ్యక్షుడు శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా డీడీ జయమ్మ మాట్లాడుతూ ఈశ్రమ్ కార్డు ఉంటే వృత్తి రీత్యా జర్నలిస్టులు ప్రమాద వశాత్తు ఏదైనా జరిగిన ఇన్సూరెన్స్ పరిహారం పొందవచ్చని అన్నారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబశివ మాట్లాడారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ రామ్‌ప్రసాద్ నాయకులు గోరంట్లప్ప, కేబీ శ్రీనివాసులు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు హుశేన్, జిల్లా కన్వీనర్ నాగేంద్ర పాల్గొన్నారు.

చెత్త సేకరణను వేగవంతం చేయాలి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సేకరణను వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో చెత్త సేకరణకు ప్రభుత్వం మంజూరు చేసిన చెత్తబుట్టలను ఆయన ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరువేరుగా చేసి చెత్త సంపద తయారీ కేంద్రానికి పంపించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

టమోటా రైతుల కన్నీళ్లు తుడిచేందుకు చర్యలు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రైతుబజార్లలో రైతుల నుంచి కేజీ రూ.10 ప్రకారం కొనుగోలు చేసి రైతుబజార్ల ద్వారా వినియోగదారులకు అందించేందుకు మార్కెటింగ్ శాఖ చర్యలు చేప ట్టింది. శనివారం కర్నూలు, నంద్యాల, ఆదోని పరిధిలలో ఉన్న రైతు బజా ర్లకు రైతుల నుంచి కొనుగోలు చేసిన టమోటాలను వినియోగదారులకు అందించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా చేపడుతున్నారు. కర్నూలు నగరంలోని రైతుబజార్లకు 90 క్వింటాళ్ల టమోటాలను అందజేశారు. ఈ టమోటాలను కిలో రూ.12 ప్రకారం వినియోగదారులకు అందించాలని ఎస్టేట్ అధికారులకు మార్కెటింగ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

'రిలయన్స్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం'

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ ఫౌండేషన్ సంస్థ చేపడుతున్న సామాజిక సేవలు అభినందనీయమని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం నగర శివారులోని జి.పుల్లారెడ్డినగర్‌లో గల విజ్ఞానపీఠం అరక్షిత శిశు మందిరంలో ప్రాథమిక తరగతుల విద్యార్థులకు రిలయన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు ఇతర స్టేషనరీ సామాగ్రితో కూడిన కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు వినోద్, శ్రీనివాసరావు, వీహెచ్‌పీ నాయకులు టీజీ మద్దిలేటి, వ్యాసరాజ్, విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

27న కాల్వబుగ్గలో భజన పోటీలు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 27న భ్రమరాంబ బుగ్గ రామేశ్వరస్వామి భజన మండలి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, ఆలయ ప్రధాన అర్చకుడు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, ఆకుల మహేష్ శనివారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్ల సభ్యులు రూ.400 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. విజేతలకు మొదటి నుంచి 13 బహుమతులు వరుసగా రూ.25వేలు, రూ.20వేలే, రూ.15వేలు, రూ.10 వేలు, రూ.9వేలు, రూ.8వేలు, రూ.7వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4 వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ.1,016ల నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పండ్లతోటల సాగుపై అవగాహన

సి.బెళగల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, ఇనగండ్ల, సిబెళగల్ గ్రామాల్లో కోడుమూరు ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌గౌడు పండ్లతోటల సాగుపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలు సాగు చేసుకునే సన్నకారు రైతులకు ప్రభుత్వం యాభై శాతం సబ్సిడీ అందజేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నరసింహారెడ్డి గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు





ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య, అధికారులు, ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో..

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉయ్యాలవాడ నరసింహారెడ్డి దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని జాయింట్ కలెక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. శనివారం ఉదయం 178వ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గొప్ప విప్లవకారుడు అన్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ వారికి ఏ మాత్రం భయపడకుండా హక్కుల కోసం ఆయన చూపిన పోరాట పటిమ, వీరత్వం, పౌరుషం ప్రతి ఒక్కరికి అనుసరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సీ. వెంకటనారాయణమ్మ, కార్పొరేషన్ కమిషనర్ రవీంద్ర బాబు, డీఎంహెచ్‌వో శాంతికళ, పర్యాటక శాఖ అధికారి విజయ, మెప్మా పీడీ నాగశివలీల, ఎంప్లాయిమెంట్ అధికారి దీపి పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బీ.క్యాంపులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. కళాశాలలో శనివారం నరసింహారెడ్డి చిత్రపటానికి ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, నైస్ కంప్యూటర్ సంస్థ నిర్వాహకుడు ఆర్.శ్రీనివాస్, అధ్యాపకులు పూలమా లలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రానికి ముందే బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసిన వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు, అధ్యాపకుడు విజయశేఖర్ పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: స్థానిక చాణిక్యపురి కాలనీలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ అధ్యక్షురాలు ఎస్వీ విజయమనోహరిలు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కోడుమూరు ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత
- అట్టహాసంగా రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల, జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో హ్యాండ్ బాల్ కర్నూలు డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల, జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ పోటీలను సీఐడీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నగేష్, జిల్లా ఒలింపిక్ సంఘం సీఈవో విజయకుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, రాయలసీమ యూనివర్సిటీ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకిషోర్, జిల్లా హ్యాండ్ బాల్ సంఘం కార్యదర్శి డా.రుద్ర రెడ్డి సర్వీసెస్ హ్యాండ్‌బాల్ టీం కోచ్ కాసీంసాహేబ్, సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు మాధవరావుతో కలిసి ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడాకారుల సంక్షేమం కోసం స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లు మూడు శాతం పెంచిందన్నారు. సీఐడీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నగేష్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు కొంత సమయం క్రీడా సాధనకు కేటాయిస్తే మేటి క్రీడాకారులుగా రాణించవచ్చన్నారు. అంతకుముందు అతిథులు పతాకా విష్కరణ చేసి క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే

కల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం మాధవీనగర్‌లోని గత స్వగృహంలో నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. హౌసింగ్ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.హనుమన్న, రామునాయక్ ఎమ్మెల్యే గౌరుచరితకు వినతి పత్రం అందజేశారు. సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల, కల్లూరు రూరల్, అర్బన్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రెవెన్యూ అర్జీలు వస్తున్నాయని అధికారులు వాటిని పరిష్కరించాలని సూచించారు.

అబుల్ కలాం ఆజాద్ సేవలు ఎనలేనివి



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పర్వీన్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి ఎనలేని సేవలు చేశారని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పర్వీన్ కొనియాడారు. శనివారం జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో వర్ధంతి సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పర్వీన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శర్మ, హుశేన్ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: భారతదేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వాణి ప్రసన్న, రామకృష్ణ, విజయశేఖర్, అక్తర్, సుజాత, పార్థసారధి పాల్గొన్నారు.

టీజీ వెంకటేశ్ సేవలు స్ఫూర్తిదాయకం

పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్



ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదికను ప్రారంభిస్తున్న టీజీ శివరాజ్

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్ అన్నారు. శనివారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, టీజీ రాజ్యలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా నగరంలోని హోటల్ మౌర్యఇన్‌లోని ఆర్య ఫంక్షన్ హాలులో, కర్నూలు ఆవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో 'టీజీ లక్ష్మీ వెంకటేశ్ ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పారిశ్రా మికవేత్త టీజీ శివరాజ్ ముందుగా టీజీ వెంకటేశ్ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో ఆవోపా ఆధ్వర్యంలో వివాహాలు చేసుకొని అన్యోన్యంగా జీవిస్తున్న దంపతులను సన్మానించారు.

అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల తనిఖీ

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కర్నూలు మెడికవర్, సీఎస్ హాస్పిటల్ స్కానింగ్ కేంద్రాలను జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు శనివారం తనిఖీ చేశారు. స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్‌కు సంబంధించిన ధ్రువపత్రా లను పరిశీలించారు. స్కానింగ్ కేంద్రాల్లోని యంత్రాలు, రిజిస్టర్‌లో నమోదు, వాటి వరుస సంఖ్య, తయారు కంపెనీల పేర్లను సరిపోల్చి చూశారు. స్కానింగ్ కేంద్రాలకు వచ్చే గర్భిణుల నుంచి పూర్తి సమాచారం తీసుకుని ఫామ్-1లో సంతకాల వివరాలు ఉండాలన్నారు. లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని, తెలిపే బోర్డులను స్కానింగ్ కేంద్రాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు మెడికవర్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి, రేడియాలజిస్టు డాక్టర్ సంతోష్, వర్మ, ప్రొజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

'రాజీవ్ గృహకల్ప'కు మరమ్మతులు చేయాలి



సంతకాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరుకున్న రాజీవ్ గృహకల్ప భవన సముదాయానికి మరమ్మతులు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కర్నూలు నగర సమితి ఆధ్వర్యంలో రాజీవ్ గృహకల్పను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సీపీఐ బృందం నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రజలకు అందజేసిన ఇళ్లు 20 ఏళ్లు గడవక ముందే శిథిలావస్థకు చేరాయన్నారు. సమస్యలపై ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టారు. అధికారులు స్పందించి రాజీవ్ గృహకల్పలో మౌలిక వసతుల కల్పించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నివేశ స్థలాల క్రమబద్ధీకరణకు చర్యలు

గూడూరు ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆక్షేపణలు లేని ప్రభుత్వ భూములపై గల ఇంటి నివేశ స్థలాల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ రామాంజనేయులు తెలిపారు. శనివారం గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆక్షేపణలు లేని ప్రభుత్వ భూముల్లో విస్తీర్ణం 0.03 సెంట్లుపై స్వాధీనానుభవంలో గల లబ్ధిదారులకు ఇంటి నివేశ స్థలాలను క్రమబద్ధీకరణ చేసేందుకు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రామాలయానికి విరాళం

సి.బెళగల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్‌లో నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి 520 సిమెంట్ బస్తాలను విరాళం అందజేసినట్లు మాజీ సర్పంచ్ చిన్న మునెప్ప తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో నిర్మిస్తున్న రామాలయానికి సాయం అందజేయాలని గ్రామ పెద్దలు మద్దయ్యస్వామి, వెంకటేశ్వరరెడ్డి, రాజు, నల్లన్న కోరగా, ఆయన 520 సిమెంట్ బస్తాల లారీని సి.బెళగల్‌కు పంపారని తెలిపారు. దీంతో గ్రామస్థులు కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ధన్యావాదాలు తెలిపారు. టీడీపీ నాయకులు మద్దయ్యస్వామి, రాజు, నల్లన్న తాత, మల్లకల్ పాల్గొన్నారు.

నేడు ఐఐటీ, జేఈఈ, నీట్ పరీక్షలపై సెమినార్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ కోటాస్ బన్సాల్ క్లాసెస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో స్థానిక బిర్లా కాంపౌండ్ సమీపంలోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాలులో ఆదివారం ఉదయం 10 గంటలకు ఐఐటీ, జేఈఈ/నీట్ పరీక్షలపై సెమినాల్ నిర్వహిస్తున్నట్లు బన్సాల్ క్లాసెస్ ఎండీ అండ్ సీఈవో షమీర్ బన్సాల్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, రాయలసీమ యూనివ ర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ఎన్‌టీకే నాయక్, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ఆర్ఐవో గురువయ్యశెట్టి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్, నంద్యాల జిల్లా డీఈవో జనార్దన్ రెడ్డి, కడప డీఈవో షంషుద్దీన్‌లు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరు కావాలని కోరారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలి : పీఆర్‌టీయూ



మాట్లాడుతున్న ఎన్‌వీ కృష్ణారెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యా యులకు సంబంధించిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పీఆర్‌టీయు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు అయినా.. ఒక ఆర్థిక ప్రయోజనం కూడా కల్పించకుండా బదిలీలు, పదోన్నతులు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ అరియర్ బకాయిలు చెల్లించాలని, ఏపీజీఎల్ఐ మెచ్యూరిటీ, లోన్స్, ఆర్జిత సెలవు బకాయిలు, ప్రావిడెంట్ ఫండ్ లోన్స్ వెంటనే చెల్లించా లని కోరారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు రావాల్సిన బెనిఫిట్స్ విడుదల చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రసిడెంట్ రవిప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్ బాబురావు, ఆదినారాయణ రెడ్డి, మణికుమార్, నాగేశ్వ రయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టిన అబివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శనివారం బీ.క్యాంపు, శరీన్‌నగర్, రాఘవేంద్రనగర్ ప్రాంతాలలో పూర్తైన రహదారులు, మురుగు కాలువలు, కల్వర్టు నిర్మాణ, పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పనులను అధికారులు ఎప్పటికప్పు డు పర్యవేక్షించాలన్నారు. క్యూరింగ్ పూర్తి అయిన తరువాతనే చివరి బిల్లులు పెట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎస్ఈ రాజశేఖర్, డీఈఈలు గిరిరాజు, మనోహర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏఈ భాను ప్రతాప్ ఉన్నారు.

ఇతర శాఖల విధులు అప్పగించొద్దు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో పని చేస్తున్న మెడికల్ డిపార్టుమెంటు హెల్త్ సెక్రటరీలకు ఇతర డిపార్టు మెంటు డ్యూటీలు అప్పగించొద్దని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏపీ జేఏసీ చైర్మన్ సీహెచ్ వెంగల్ రెడ్డి కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబును కోరారు. శనివారం ఏపీ ఎన్జీవోస్ అసోసి యేషన్ నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్‌కు సంబంధించిన విధులకు మాత్రమే హెల్త్ సెక్రటరీలకు బాధ్యతలు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కేసీహెచ్ కృష్ణుడు, నగర అధ్యక్షులు ఎంసీ కాశన్న, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు చందన, మెడికల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ ఈశ్వర య్య, మునీర్ అహ్మద్, మద్దయ్య పాల్గొన్నారు.

'రైతు గుర్తింపు కార్డు తీసుకోండి'

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టాదారు పాసు పుస్తకం ఉన్న రైతులంతా విశిష్ట గుర్తింపు కార్డు తీసుకోవాలని వ్యవ సాయాధికారి రవిప్రకాష్‌గౌడ్ కోరారు. మండలంలోని వర్కూరు రైతు సేవా కేంద్రాన్ని శనివారం సందర్శించి రైతులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, వన్‌బీ, అడంగల్ వెంట తీసుకుని ఆర్ఎస్కేలో నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో 7 వేల మంది రైతులు మాత్రమే నమోదు చేసుకున్నారని, మిగిలిన రైతులు కూడా విశిష్ట గుర్తింపు కార్డు కోసం నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యక్ర మంలో ఆర్ఎస్కే సిబ్బంది ప్రకాష్, అనూష పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో ఉపాధి పనులను శనివారం ఎంపీడీవో రాముడు తనిఖీ చేశారు. అనంతరం ఆయన కూలీల హాజరు, మస్టర్లు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు పనివేళలు పాటించాలని, రూ. 300 వేతనం అందడానికి నిర్దేశిత కొలతల పని పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే సచివాలయం సందర్శించి పెండింగ్ సర్వేలు, పీ4 సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించాలని, షెడ్డులో వర్మీ కంపోస్టు తయారు చేయాలని అధికారులకు సూచించారు.

మిరప రైతుకు మద్దతు ధర అందించాలి



కమీషన్ ఏజెంట్లతో మాట్లాడుతున్న సెక్రటరీ జయలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మిరప రైతులకు గిట్టుబాటు ధర అందించాలని, ఈ విషయంలో కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు సహకరించాలని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి ఆదేశించారు. శనివారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో సెక్రటరీ చాంబర్‌లో కమీషన్ ఏజెంట్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావే శంలో గతంతో పోలిస్తే ప్రస్తుతం రైతుకు అందుతున్న ధర గిట్టుబాటు కాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి గిట్టుబాటు ధర అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నాగేష్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: డీపీవో

సి.బెళగల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీపీవో భాస్కర్ పంచాయతీ కార్యదర్శులకు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో పరిసరాల శుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో లేరని గ్రామస్థులు ఫిర్యాదు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్ పాండురంగన్న పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం 16వ వార్డు సచివాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు మా ప్రభుత్వం వస్తే ఇల్లు లేని ప్రతి నిరుపేదకు రెండు సెంట్లు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షలు ఇస్తామని చంద్రబాబు ఓట్లు వేయించుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు పేదలకు ఇచ్చే రెండు సెంట్ల స్థలం కోసం అనేక రకాల షరతులు పెట్టి ఇస్తామంటే సరైంది కాదన్నారు. నగర సహాయ కార్యదర్శి మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, నగర కార్యదర్శి బీసన్న, కల్పన, చాముండేశ్వరి పాల్గొన్నారు.

రోస్టర్ పాయింట్లను సవరించాకే పరీక్షలు నిర్వహించాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షల్లో ఉన్న రోస్టర్ పాయింట్స్‌ను సవరించిన తరువాతనే మెయిన్ పరీక్షలు నిర్వహిం చాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోస్టర్ లోపాల కారణంగా అనేక మంది అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుత పరీక్షా విధానంలో అనేక తప్పిదాలు చోటుచేసుకున్నాయన్నారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి బీసన్న, చంటి, అఖిల్ పాల్గొన్నారు.

రీ సర్వేను పకడ్బందీగా చేయండి

తుగ్గలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేను పకడ్బందీగా చేయాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. శనివారం కార్యాలయంలో మాట్లాడుతూ పగిడిరాయి రెవెన్యూలో రీసర్వేను రైతుల అనుమతితోనే చేయాలని సూచించారు. డీటీ నాగరాజు, సర్వేయర్ సుధాకర్, ఆర్ఐ వెంకట్రాముడు, వీఆర్వోలు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



గ్రామస్థులతో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధులు

తుగ్గలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జొన్నగిరి గ్రామంలో మౌలిక వసతులను కల్పిస్తామని జియో మైసూరు కంపెనీ డైరెక్టర్ మానసరంజన్ బిశ్వాల్, మేనేజర్ రామ్మోహన్ సోమిరెడ్డి అన్నారు. శనివారం గ్రామస్థులతో మాట్లాడుతూ తాగునీటి కోసం శుద్ధజల ప్లాంటు, విద్యార్థుల సౌకర్యార్థం లైబ్రరీ ఏర్పాటు చేస్తామన్నారు. ఇంకా సమస్యలు ఉంటే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. టీడీపీ నాయకులు పుల్లన్న, వెంకటేశ్వర్లు ఉన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జేసుదాసు

వెల్దుర్తి టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పరీక్షలంటే భయం వీడాలని కర్నూలు గుడ్ షెపర్డ్ పాఠశాల కరస్పాండెంట్ జేసుదాసు సూచించారు. శనివారం వెల్దుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను ఒకటి రెండు సార్లు అవగాహన చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, స్వీట్లు అందజేశారు. వావిలాల కృష్ణమూర్తి, అగస్టీన్, రవిశంకర్, ఖాజాబేగ్, సెక్రటరీ వెంకటేశ్వరరెడ్డి, ఎంఈవో ఇంద్ర, హెచ్ఎంలు చంద్రకళ, తాజ్‌బాబా, ఉమేంద్ర, అల్లాబకాష్ విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఆదోని రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తోందని, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సూచించారు. శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పని చేయని బోర్లకు మరమ్మతులు చేయించాలని, పారిశుధ్య పనులను అశ్రద్ధ చేయవద్దన్నారు. ఈవోఆర్డీ జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

టమోటా రైతులకు అండగా ఉంటాం



పంటను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టమోటా రైతులకు అండగా ఉంటామని తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి, తిరుపాల్ నాయుడు, కొమ్మె వెంకటేశ్, వెంకటస్వామి, చంద్రశేఖర్ యాదవ్ హామీ ఇచ్చారు. శనివారం రాతన గ్రామ శివారులో టమోటా పంటను పరిశీలించారు. పత్తికొండ ప్రాంతంలో టమోటా అధికంగా సాగు చేస్తారని, ఇక్కడ ప్రాసెసింగ్ యూనిట్లు లేకపోవడంతో గిట్టుబాటు ధర అందడం లేదన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి టమోటా రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ప్రారంభమైతే పత్తికొండలోనే కొనుగోలు చేస్తారన్నారు. కృష్ణమూర్తి చౌదరి, కొత్తూరు చక్రవర్తి, వల్లె వెంకటేశ్, సంఘాల కృష్ణ, గిరిగిట్ల మల్లి, జయరాం, క్రిష్ణ రవికుమార్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని సిద్ధార్థ వికలాంగుల సమాఖ్య అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీవో సువర్ణలతకు వినతి పత్రం అందజేశారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు దివ్యాంగులు కూడా దరఖాస్తు చేశారన్నారు. సంఘం నాయకులు శ్రీనివాసులు, బీరప్ప, శేషయ్య, రంగస్వామి, పాండురంగడు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న దివ్యాంగులు

షరా మామూలే..

- రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- సీఎంకు ఫిర్యాదు చేశారని చైర్‌పర్సన్‌పై వైసీపీ కౌన్సిలర్ల ఆగ్రహం



చైర్ పర్సన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైసీపీ కౌన్సిలర్లు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): షరా మామూలే ఆదోని మున్సిపల్ సమావేశం రసాభాసగా సాగింది. శనివారం చైర్‌పర్సన్ వాల్మీకి శాంత అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. పట్టణంలో పూడిక తొలగింపుపై మున్సిపల్ చైర్‌పర్సన్ వాల్మీకి శాంత సీఎంకు ఫిర్యాదు చేయడంపై వైసీపీ కౌన్సిలర్లు పోడియం వద్ద నిరసన తెలిపారు. వైసీపీ కౌన్సిలర్లు వైజీ బాలాజీ, సందీప్ రెడ్డి, రఘు, ముల్లా గౌస్, నరసింహులు మాట్లాడుతూ ముఖ్యమంత్రికి లేఖ ఎందుకు రాశారో సభకు తెలపాలని డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ సమాధానం ఇస్తూ పూడిక తొలగింపు పనుల్లో అవినీతి చోటుచేసుకుందని ఆరోపణలు రావడంతోనే ఫిర్యాదు చేశానన్నారు. నిధులను వినియోగించుకోకపోతే వెనక్కి వెళ్తాయని గత సమావేశంలో ఎమ్మెల్యే చెప్పడం తోనే, బిల్లుల చెల్లింపుకు తాము అంగీకరించామని వైసీపీ సభ్యులు అన్నారు. పనులపై అనుమానాలు ఏమైన ఉంటే కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో అంశంపై చాలాసేపు వాగ్వాదం చోటు చేసు కొంది. అమరావతి నగర్ అభివృద్ధి పనులను వైస్‌చైర్మన్ నరసింహులు మూడోసారి వాయిదా వేయించారు. దీంతో ఆ వార్డు కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ దూషించడంతో వైసీపీ సభ్యులు అభ్యం తరం తెలియజేస్తూ, ఆమెను బయటికి పంపాలని పోడియం వద్దకు చేరారు. దీంతో వెలాల్ల లితమ క్షమాపణలు కోరడంతో సభ్యులు శాంతించారు.

అధికారులపై వైస్ చైర్మన్ ఆగ్రహం

వార్డుల్లో మంజూరు అయిన పనులను ఎందుకు ప్రారంభించడం లేదని, నిధుల కొరత ఉంటే పనులను ఎందుకు ఆమోదిస్తున్నారని వైస్ చైర్మన్ నరసింహులు అధికారులను ప్రశ్నించారు. మహిళా కౌన్సిలర్లు హసీనా, పార్వతి మాట్లాడుతూ, తమ వార్డుల్లో పనులు చేయడం లేదని, ప్రజలకు సమాధానం చెప్పుకోలేక పోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ మలేకార్ రాజేశ్వరి మాట్లాడుతూ, తన వార్డులో అనుమతి లేకుండానే బహుళ అంతస్థుల భవనాలను నిర్మిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనంగా ఉండటంపై నిరసన వ్యక్తం చేశారు. కమిషనర్ కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఏసీపీ కృష్ణ సింగ్, డీఈలు గోపినాథ్, చలపతి ఆర్వో నాసిర్ పాల్గొన్నారు.

భయాన్ని పోగొట్టేందుకే మోడల్ పేపర్

మద్దికెర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని పోగొట్టేందుకే మోడల్ పేపర్‌తో పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎంఈవో రంగస్వామి, ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షుడు చొక్కా సునీల్ కుమార్ అన్నారు. శనివారం మోడల్ పేపర్లను విడుదల చేశారు. 24న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఆదర్శ పాఠశాలలో పరీక్ష ఉంటుం దన్నారు. హెచ్ఎం హజరయ్ బాబు, శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి వంశీ ఉన్నారు.

పట్టా పొందేందుకు అవకాశం

మద్దికెర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం పట్టా ఇస్తుందని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ అన్నారు. శనివారం మద్దికెరలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. జీవో 30 ఆధారంగా 2019 లోపు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని అనుభవంలో ఉన్నవారు మార్చి15లోపు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్ఐ రవికుమార్, వీఆర్వోలు రంగస్వామి, రషీద్ ఉన్నారు.

సోలార్ ఒప్పందాన్ని రద్దు చేయాలి

- కారుచౌకగా భూములను కొట్టేస్తున్నారు
- రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

ఆలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో సోలార్ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేసుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆలూరు నియోజకవర్గంలో ఆస్పరి, జోహరాపురం, మొలగవల్లి, ముద్దనగేరి, హొళగుంద గ్రామాల్లో పర్యటించారు. సేకరిస్తున్న భూముల కొనుగోలు, లీజు ఒప్పందాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో మాట్లాడుతూ ఈ ఒప్పందం కంపెనీలకు మేలు చేసేందుకేనని ఆరోపించారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్య సాయి, కడప జిల్లాల్లో ఏర్పాటు చేయడంపై ప్రశ్నించారు. ఆంధ్రలో భూముల విలువ ఎక్కువగా ఉన్నందుకే రాయల సీమలో పెడుతున్నారన్నారు. దళారుల మధ్యవర్తిత్వంలో భూములను కారుచౌకగా కొట్టేస్తున్నారని మండిపడ్డారు. మొలగవల్లిలో ఎకరాకు రూ.5లక్షలు మాత్రమే ఇస్తున్నారన్నారు. మరో కంపెనీ లీజు పద్ధతిలో సంవత్సరానికి రూ.30వేలు లీజు చెల్లించేలా, మూడేళ్ల కోసారి 4 శాతం పెంచుతామని మాయమాటలు చెప్పి రైతుకు ఉరి వేస్తున్నారన్నారు. ఎకరాకు రూ.25లక్షల ప్రకారం కొనుగోలు చేయాలని, లీజు పద్ధతిలో నెలకు రూ.30వేలు చెల్లించి మూడేళ్లకోసారి 25శాతం అదనంగా చెల్లించి ప్రభుత్వమే మధ్యవర్తిత్వం వహించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ, సహాయ కార్యదర్శులు పి హనుమంతు, సూరి, మృత మండల కార్యదర్శులు ఈరన్న, ధనుంజయ పాల్గొన్నారు.

నేషనల్ మీన్స్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు మండలంలోని పెద్ద హరివాణం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అశ్విని, మబ్బుల్ హుస్సేన్ ఎంపికైనట్లు హెచ్ఎం ఇందిరా దేవి తెలిపారు. శనివారం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. 8వ తరగతి విద్యార్థులు అశ్విని, మబ్బుల్ హుస్సేన్ ఎంపికయ్యారని వారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12వేలు స్కాలర్‌షిప్ వస్తుందన్నారు.





అశ్విని, మబ్బుల్ హుస్సేన్(ఫైల్)

జీవోను విడుదల చేయాలి

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై గోడౌన్ హమాలీలకు పెంచిన కూలి రేట్ల జీవోను విడుదల చేయాలని యూనియన్ అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం మార్కెట్ యార్డులోని సివిల్ సప్లై గోడౌన్ వద్ద హమాలీలు ఆందోళన చేశారు. ఇటీవల రూ.25ల నుంచి రూ.28లు పెంచుతామని అధికారులు హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా అమలు కావడం లేదన్నారు. నాయకులు వీరాంజినేయులు, బాబన్న, రామాంజిని, వీరేష్, ప్రకాష్, నర్సింలు, కే వీరేష్ పాల్గొన్నారు.

26 నుంచి ఫక్కీరప్ప ఉత్సవాలు

తుగ్గలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బోడిబండ ఫక్కీరప్ప స్వామి ఉత్సవాలు ఈ నెల 26 నుంచి ఉంటాయని టీడీపీ నాయకుడు, ధర్మకర్త అప్పా వేణుగోపాల్ తెలిపారు. 26న ఊరేగింపు, 27న గంగాభిషేకం, అన్నదానం ఉంటుదన్నారు. సాయంత్రం రథోత్సవం జరుగుతుందన్నారు.

25న రుణాలకు ఇంటర్వ్యూలు

వెల్దుర్తి/టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ, ఈబీసీ, కాపు అభ్యర్థులకు సబ్సిడీ రుణాలకు ఈ నెల 25న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుహాసినమ్మ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. వెల్దుర్తిలోని మూడు బ్యాంకులతో పాటు గోవర్ధనగిరి ఏపీజీబీ, రామళ్లకోట కెనరాబ్యాంకు, కలుగోట్ల కెనరా బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూ ఇస్తారన్నారు. ఆధార్, రేషన్, బ్యాంకు పాస్ బుక్‌తో పాటు దరఖాస్తు ఫారంను తీసుకుని హాజరు కావాలన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

మద్దికెర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి కార్మికులకు ఇవ్వాలని ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, కార్యదర్శి రేణుక కోరారు. శనివారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఇలా చెత్తను వేరు చేస్తే చెత్త సంపద కేంద్రానికి తీసుకెళ్లడానికి వీలుగా ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు



అశ్వాన్ని ఊరేగిస్తున్న భక్తులు

దేవనకొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరివేములలో వన్నూరువలి ఉరుసు శనివారం నిర్వహించారు. అశ్వాన్ని ఊరేగించి, భక్తులు మొక్కుబడులు చెల్లించారు.

టమోటా కొనుగోళ్లు ప్రారంభం

పత్తికొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మార్కెట్‌యార్డ్‌లో శనివారం టమోటా కొనుగోళ్లను కార్యదర్శి కార్నలీస్ ప్రారంభించారు. ధరలు పడిపోవడంతో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా గిట్టుబాటు ధరను కల్పించేందుకు చర్యలు తీసుకుందని, మూతపడ్డ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అధికారుల ఆదేశాలతో తిరిగి ప్రారంభించామన్నారు. నాణ్యతను బట్టి కిలో రూ.8ల నుంచి రూ.10ల వరకు కొనుగోలు చేసినట్లు వీటని కర్నూలు రైతుబజార్‌కు తరలిస్తున్నామని కార్యదర్శి తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఆస్పరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టకలమర్రి మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షమీల శనివారం తెలిపారు. ఈనెల 24 నుంచి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఏప్రిల్ 20 తేదీన మోడల్ స్కూల్‌లోనే రాత పరీక్ష ఉంటుందని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



అర్జీలను స్వీకరిస్తున్న వీరభద్ర గౌడ్

- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేమయని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రారంభించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి శనివారం వినతులు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపి పరిష్కారం చూపుతామన్నారు. ఆలూరు బ్రాంచ్ కెనాల్ అధ్యక్షుడు నగర డోణ కిష్టప్ప, కన్వీనర్ అశోక్ యాదవ్, గిరి మల్లేష్ గౌడ్, తిమ్మయ్య, గుండయ్య, వన్నూరు వల్లి, సురేంద్ర, రాము యాదవ్, వెంకటేష్, రమేష్, హనుమప్ప, గూల్యం రామాంజినేయులు ఉన్నారు.

సాదాసీదాగా సమావేశం



మాట్లాడుతున్న అధికారులు

పత్తికొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం శనివారం సాదాసీదాగా సాగింది. ఎంపీడీవో స్వర్ణలత, తహసీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో అధికారులు గ్రామాల్లో చేస్తున్న అబివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కాగా కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు గైర్హాజరయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ గైర్హాజరైన వారికి నోటీసులు జారీ చేస్తామని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎంపీపీ దాసు, వైస్ ఎంపీపీలు బలరాముడు, రంగమ్మ పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహా భాగ్యం

మద్దికెర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహా భాగ్యమని సర్పంచ్ పద్మావతి, టీడీపీ నాయకులు రంగస్వామి, కొత్తూరు శ్రీనివాసులు అన్నారు. శనివారం బురుజుల గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో అనంతపురం వైద్యులచే ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 100 మందికి 2డీ ఎకో, ఈసీజీ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్

జనం లేని సామాజిక తనిఖీ

హొళగుంద, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. అడిషనల్ పీడీ మాధవి లత హాజరయ్యారు. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31-2024వరకు జరిగిన పనులకు 17వ విడత సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేశారని తెలిపారు. అయితే ఈ ప్రజావేదికకు అధికారులు, సిబ్బంది తప్ప జనం రాలేదు. తూతూ మంత్రంగా అధికారులు ఈ సమవేశాన్ని ముగించారు. ఈ ఏడాది మొత్తం రూ.11,64,70,750ల విలువైన పనులు చేయగా, రూ.75971ల అవినీతి జరిగిందని రికవరీ చేయాలని సూచించారు. 23 గ్రామాల్లో తనిఖీ చేసి రూ.40వేల పెనాల్టీ విధించారు. వీటిని ఉపాధి అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్ దగ్గర నుంచి రికవరీ చేయాల్సి ఉంది..

నల్ల బెల్లాన్ని విక్రయిస్తే చర్యలు

ఆదోని, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నల్ల బెల్లాన్ని విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ సైదుల్లా హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆదోని ఎక్సైజ్ కార్యాలయంలో బెల్లం వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆదోనిని సారా రహిత డివిజన్‌గా మార్చేందుకు సహకరించాలని కోరారు. నల్లబెలం, సారా కేసుల్లో పీడీ యాక్టు నమోదు చేస్తామని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తామన్నారు.



బెల్లం వ్యాపారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ సైదుల్లా

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆదోని రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడితోట గ్రామంలో మృతిచెందిన మాల రాఘవేంద్ర కుటుంబానికి జనసేన నాయకులు రూ.10వేలు అందజేశారు. నాయకుడు తాహెర్ వలి మాట్లాడుతూ రాఘవేంద్ర మృతి బాధాకరమని, త్వరలో పార్టీ తరఫున కుటుంబానికి రూ.5లక్షలు ఇస్తామన్నారు. ఫ్యాక్టరీ యజమానులు కూడ కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని తాహేర్ వలి కోరారు.



కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న జనసేన నాయకులు

పురపాలక స్థలాలను రక్షించాలి

ఆదోని టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక స్థలాలన రక్షించాలని మైనార్టీ హక్కుల సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ ఎల్ఐజీ కాలనీలోని మునిసిపల్ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడంపై ఫిర్యాదు చేసిన వెంటనే అధికారులు స్పందించి పనులను నిలిపివేయడం పట్ల అభినందించారు. పార్కు స్థలాలు ఇప్పటికే అన్యాక్రాంతం అయ్యాయని, కనీసం ఖాళీ స్థలాలకు ప్రహరీ నిర్మించి కాపాడాలని కోరారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఉప్పరపల్లి సొసైటీ సీఈవో గిడ్డయ్య



తుగ్గలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సొసైటీల్లో రుణాలు తీసుకున్న రైతులు తిరిగి చెల్లించాలని ఉప్పర్లపల్లి సొసైటీ సీఈవో గిడ్డయ్య అన్నారు.

ప్రశ్న: సొసైటీల్లో కంప్యూటరీ కరణ పూర్తయిందా?

జవాబు: కంప్యూటరీకరణ దాదాపు పూర్తయింది. రికార్డులను ఆన్‌లైన్ చేశాం.

ప్రశ్న: డిపాజిట్లను ఎలా సేకరిస్తున్నారు?

జవాబు: డిపాజిట్లను సేకరించేందుకు కరపత్రాలు పంపిణీ చేస్తున్నాం. గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటుచేస్తున్నాం.

ప్రశ్న: కొత్తగా రుణాలు ఇస్తున్నారా?

జవాబు: కొత్త రుణాలు, బంగారు రుణాలు పరిమితంగా ఇస్తున్నాము. త్వరలోనే పూర్తిస్థాయిలో ఇస్తాం. రుణాలు తీసుకున్నవారు చెల్లిస్తే.. ఎక్కువ మందికి ఇస్తాం.

ప్రశ్న: అప్పులను రికవరీ చేస్తున్నారా?

జవాబు: కొందరు రైతులు సక్రమంగా చెలించి, రెన్యువల్ చేసుకుంటున్నారు. అయితే మరికొందరు రైతులు రుణాలు చెల్లించకుండా మొండి బకాయి దారులుగా మారారు. వారికి కోసం నోటీసులు జారీ చేసి, జిల్లా రికవరి అధికారులతో కలిసి వారి ఇళ్లకు వెళ్లి రుణాలను చెల్లించాలని కోరుతున్నాం.

ప్రశ్న: సొసైటీ నుంచి రైతులకు వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నారా?

జవాబు: వాహనాలకు సబ్సిడీ రుణాలు ఇస్తున్నాం. ప్రభుత్వం సొసైటీలకు ఇచ్చినప్పుడు మాత్రమే వ్యవసాయ పనిముట్లు ఇస్తున్నాం.

అల్లీసాహెబ్ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బీవీ



అల్లీసాహెబ్ స్వామిని ప్రార్థిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్ కైరవాడి గ్రామంలో వెలసిన అల్లీసాహెబ్ స్వామిని శనివారం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. గంధం మహోత్స వం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమ తాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారు. ఆయన వెంట హెచ్ కైరవాడి టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, రాజేష్, జయరామ్‌గౌడ్, పెద్దయ్య, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం: క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతో తోడ్పడతాయని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరెడ్డి అన్నారు. శనివారం హెచ్ కైరవాడి గ్రామంలో అల్లిపీరస్వామి ఉరుసు సందర్భంగా దివంగత మంత్రి బీవీ మోహన్‌రెడ్డి స్మారకార్థం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. గెలు పొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ. 12,016, రెండవ బహుమతిగా రూ. 8,016, మూడవ బహుమతిగా రూ. 5,016, నాల్గొబహుమతిగా రూ. 3,016 అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను శనివారం రాత్రి పొద్దు పోయాక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. అనంతరం క్రీడాకాలను పరిచయం చేసుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 20 జట్లు హాజరయ్యాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థికి కీలక దశ

కౌతాళం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి పదవ తరగతి దశ ఎంతో కీలకమని ఎంపీడీవో సుబ్బరాజు అన్నారు. శనివారం కౌతాళంలోని ప్రతిభ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీవో సుబ్బరాజు, ఈఓపీఆర్డీ యోగేశ్వరరెడ్డి, ప్రైవేటు పాఠశాలల ఆదోని డివిజన్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగడానికి పదవ తరగతి ఎంతో మేలు చేస్తుందన్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు క్రిష్ణమూర్తి, నాగేంద్ర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు మైనుద్దీన్, భీమేష్, ఈరన్న, జయలక్ష్మీ, శిరీష ఉన్నారు.

'ఇటుకల బట్టీల యజమానులపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఇటుకల బట్టీల యజమానులపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శులు తిమ్మగురుడు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విజయేంద్ర, నరసింహారెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సోమప్ప సర్కిల్‌లో కళ్లకు నల్లబ్యాడ్జీలు కట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు కేసీ జబ్బార్, మాలిక్, మల్లికార్జునగౌడు, నరసింహులు, లోకేష్, శివకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

గోనెగండ్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎన్ఎంఎంఎస్ 2024-25 (నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్)జరిగిన పరీక్షలో గోనెగండ్ల మోడల్ స్కూల్ ఎనిమిదవ తరగతి చదువుతున్న రెహన్, స్నేహలత ప్రతిభను కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ షహనాపర్విన్ తెలిపారు. ఈ స్కాలర్ షిప్ కోసం గత ఏడాది డిసెంబరు 8న పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రూ. 12000 ప్రకారం నాలుగేళ్లు అందజేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

రీసర్వేలో అవకతవకలకు తావివ్వొద్దు

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్
- మంత్రాలయం బైపాస్ అలైన్‌మెంట్ పరిశీలన

మంత్రాలయం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో అవకతవకలకు తావివ్వకుండా జాగ్రత్తలు పాటించి నిక్కచ్చిగా కొలతలు వేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర భరద్వాజ్ సూచించారు. శనివారం మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న సర్వేను తనిఖీ చేశారు. పట్టాభూములు, ప్రభుత్వ భూములు వాగు, పరంబోకు భూములు కొలతల్లో ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా సర్వే చేయాలని సూచించారు. ప్రతి భూమి హక్కుదారులు సంబంధిత రైతుల ఎదుట కొలతలు నమోదు చేయాలని, ముందుస్తుగా రైతులకు నోటీసులు ఇచ్చి వారి ఆధ్వర్యంలోనే రీసర్వే చేయాలని, వారి దగ్గరున్న ఆధారాలు, ఆధార్, బ్యాంకు ఖాతా, ఫొటోలు ఆన్‌లైన్ అడంగల్ సరి చూసుకోవాలన్నారు. రీసర్వేపై సర్వేయర్లు, వీఆర్వోలు నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.రవి, మండల సర్వేయర్ అశోక్, సర్వేయర్లు నవీన్, తిమ్మేశ్, శేఖర్ నాయక్, ధరణి, కీర్తి, వీఆర్వోలు భీమన్నగౌడు, భీముడు, పుష్పలత, వీరేష్ పాల్గొన్నారు.

● **మంత్రాలయం బైపాస్ అలైన్‌మెంట్ పరిశీలన:** మంత్రాలయం బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోయే రైతులతో పాటు అలైన్‌మెంటును ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిశీలించారు. మండలంలోని కల్లుదేవకుంట, చెట్నహళ్లి గ్రామాల సమీపం వరకు నిర్మాణం చేపట్టే బైపాస్ రోడ్డు పనులకు హైవే రోడ్డు అథారిటీ నిధులు మంజూరు చేసిందన్నారు. అలైన్‌మెంటులో రాఘవేంద్రస్వామి మఠానికి చెందిన కొన్ని భూములు కోల్పోతున్న నేపథ్యంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో కలసి చర్చించారు. అనంతరం రైతులతో మాట్లాడారు.



మంత్రాలయంలో రీసర్వేను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

కార్యక్రమంలో మఠం మేనేజర్ సురేష్ కోనాపూర్, తహసీల్దార్ ఎస్.రవి, సర్వేయర్ అశోక్, హైవే రోడ్డు డీఈ సుదాకర్, ఏఈ శేఖర్, పాల్గొన్నారు.

గోనెగండ్ల: పొరపాట్లను తావులేకుండా నియమ నిబంధనల ప్రకారం రీసర్వే ప్రక్రియ చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. రీసర్వే పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన గోనెగండ్లలో శనివారం రీసర్వే జరుగుతున్న తీరును, రికార్డులను ఆయన పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు గ్రామసభలలో ఏ సమస్యలు వచ్చాయి? అందులో ఎన్ని సమస్యలను పరిష్కరించారు? రెవెన్యూ సభలు ఎన్ని జరిగాయి? అందులో రైతుల నుంచి ఎన్ని అర్జీలు వచ్చాయి? ఎన్ని పరిష్కరించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని సబ్ కలెక్టర్ ఆరా తీశారు. సర్వే రికార్డులు, మ్యాప్‌లను ఆయన పరిశీలించారు. రైతుల సమక్షంలోనే సర్వేలు చేయాలని ఆదేశించారు. వీఆర్వో స్థానికంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

రమణీయం.. రాఘవేంద్రుడి స్వర్ణ పల్లకి సేవ

మంత్రాలయం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకోత్సవం రమణీయంగా సాగింది. శనివారం నవమి శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్టించి శ్రీమఠం చుట్టూ ఊరేగించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు మంగళవాయిద్యాలు మధ్య స్వామి వారు బంగారు పల్లకి ఊరేగుతున్న దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఊంజలసేవ చేశారు. పీఠాధిపతి భక్తులకు ఫల,పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

మంత్రాలయంలో భక్తుల సందడి

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన అశేష భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. శనివారం నవమి కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగనం భక్తులతో కిక్కిరిసింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాల



స్వర్ణపల్లకిలో విహరిస్తున్న రాఘవేంద్రస్వామి

మ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

కారు సీజ్.. ముగ్గురి అరెస్టు



పట్టుబడిన కర్ణాటక మద్యంతో ఎక్సైజ్ అధికారులు

మంత్రాలయం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం చెక్‌పోస్టు వద్ద కర్ణాటక మద్యాన్ని టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం మాధవరం చెక్‌పోస్టు వద్ద కారులో 30 బాక్సుల్లో 2,880 కర్ణాటక 90 ఎంఎల్ ఒర్జినల్ చాయిస్ విస్కీ మద్యం టెట్రా ప్యాకెట్లుతో రాయచూరుకు చెందిన ఈడిగ వెంకటేశ్వర్లు, కర్ణాటక లోని రాజోలికి చెందిన తిమ్మయ్య, దేవనకొండ మండలంలోని తలమర్రి గ్రామానికి చెందిన నాగయ్య గౌడు అనే ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1,15,200 ఉంటుందని అంచనా వేశారు. కారును సీజ్ చేసి ముగ్గురిని అరెస్ట్ చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరిచారు. కర్ణాటక మద్యం విక్రయించినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, సీఐ రాజేంద్ర, మాధవరం చెక్‌పోస్టు సీఐ చంద్రశేఖర్‌నాయుడు, ఎమ్మిగనూరు ఎక్సైజ్ సీ రమేష్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

లాడ్జిల్లో రికార్డు పుస్తకాల చోరీ

మంత్రాలయం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలోని ప్రైవేటు లాడ్జిల్లో రిసిప్షన్ కౌంటరులో ఉన్న ఎంట్రీ పుస్తకాలు మాయమవు తున్నాయి. గత వారం రోజుల నుంచి 15 లాడ్జిల్లో రికార్డులు మాయమవడం చర్చనీయాంశంగా మారింది. దర్శనార్థం వచ్చే భక్తులకు, రూములను అద్దెకు ఇచ్చే సమయంలో రికార్డుల్లో పేరు నమోదు, అడ్రస్, సెల్, ఆధార్ నెంబరు వాటిల్లో నమోదు చేస్తారు. అనంతరం రూము అద్దెకు ఇస్తారు. ఇదిలా ఉండగా.. పది రోజు ల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రిసిప్షన్ కౌంటరులో ఎవరూ లేని సమయంలో మాటు వేసి ఆ రికార్డులను ఎత్తుకెళ్తున్నారు. ఇది ఒక దందాగా మారింది. ఇలా రికార్డుల్లో దాదాపు ఐదునెలల నుంచి వందల సంఖ్యలో ఫోన్ నెంబర్లు, అడ్రస్‌లు, ఉంటాయి. ఆర్టీసీ బస్టాండు దగ్గర ఉన్న లాడ్జీలో మూడేళ్లకు సంబంధించి ఐదు రికార్డులను ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై ప్రైవేటు లాడ్జిల యజమానులు మంత్రాలయం సీఐ రామాం జులు దృష్టికి తీసుకెళ్లారు. సీసీ పుటేజీలను పంపిస్తే వాటిని విచారణ చేస్తామని తెలిపారు. రికార్డుల మాయం వెనుక ఏదైనా కుట్ర జరుగుతుందో నని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

హెచ్.కైరవాడిలో డెంగీ కేసు నమోదు



బాలుడి ఇంటి వద్ద విచారణ చేస్తున్న అధికారులు

గోనెగండ్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో డెంగీ వ్యాధి కేసులు నాలుగురోజులుగా పెరుగుతున్నాయి. శనివారం హెచ్‌కైరవాడి గ్రామంలో ఓ బాలుడికి డెంగీ సోకింది. దాంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఆదోని డివిజన్ మలేరియా నివారణ అధికారి సాయిబాబా, వైద్యశాఖ సిబ్బంది గ్రామంలో పర్యటించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. రోగులకు జ్వరం, దగ్గు, జలుబు, ఇతర వ్యాధులు ఉన్నవారికి ఉచితంగా మందులను అందజేశారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం ఉన్నట్లు తెలిస్తే వెంటనే గోనెగండ్ల ప్రభుత్వ అసుపత్రికి రావాలిని వైద్యసిబ్బంది గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు పరమేశ్వరప్ప, భారతి, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్, వైద్యఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కౌతాళం ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ ఆంజనేయస్వామి దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని బుములదొడ్డి, ఎరిగేరి పులిగట్టు, అగసలదిన్నె ఆంజనేయస్వామి దేవాలయాల్లో అర్చకులు స్వామివారికి ప్రత్యేక ఫలపుష్పాలతో అలంకరించారు. బుడుములదొడ్డి ఆంజనేయ స్వామికి ఆకుపూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


వాల్మీకుల హక్కుల కోసం పోరాటం

మంత్రాలయం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ వాల్మీకుల హక్కుల కోసం 40 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని ఐక్య వాల్మీకి పోరాట కమిటి రాష్ట్ర అధ్యక్షుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న అన్నారు. శనివారం మంత్రాలయం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామాంజులకు వాల్మీకి అసోసియేషన్ తరుపున తయారు చేసిన డైరీని అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు రవిచంద్ర, వెంకటేశ్ పాల్గొన్నారు.

రేపు పార్లపల్లిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠను సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని గ్రామ ప్రజలు కోరారు.

గురుభక్తి ఉత్సవాలకు కర్ణాటక సీఎంకు ఆహ్వానం



కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, కృష్ణకౌశిక్

మంత్రాలయం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి పట్టాభిషేకం, జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నిర్వహించే గురుభక్తి ఉత్సవాలకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, కృష్ణ కౌశిక్ ఆహ్వాన పత్రికను అందజేశారు. శనివారం బెంగళూరులో వారి నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికలతో పాటు పీఠాధిపతి ఇచ్చిన శేషవస్త్రం, పరిమళ ప్రసాదం, రాఘవేంద్రస్వామి మెమెంటో అందజేశారు. కర్ణాటక ఇరిగేషన్ శాఖ మంత్రి బోసు రాజుకు, అలాగే కేంద్ర మంత్రులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. మార్చి 1 నుంచి 6 వరకు గురుభక్తి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

గోనెగండ్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శనివారం ఉదయం ఎంపీడీవో సమావేశ భవనం ఎంపీడీవో మణిమంజరి, గోనెగండ్ల స్టేట్ బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలను బ్యాంక్ అధికారులు పరిశీలించారు. గోనెగండ్ల ఎస్‌బీఐ బ్యాంక్ పరిధిలోని గోనెగండ్ల, ఐరన్‌బండ, కులుమాల, నెరుడుప్పల, పెద్దమరివీడు గ్రామాల నుంచి 242 మంది దరఖాస్తు చేసుకోగా 82మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. కార్యక్రమంలో పలు బ్యాంక్ అధికారులు, ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ.. ఇద్దరికి గాయాలు

మంత్రాలయం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చిలకలడోన గ్రామం వద్ద శనివారం ట్రాలీ ఆటోను లారీ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలడోన గ్రామానికి చెందిన ఎరుకుల కృష్ణమూర్తికి చెందిన ట్రాలీ ఆటోను బళ్లారికి చెందిన లారీ ఢీకొట్టింది. ఆటో ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఆటో పక్కనే ఉన్న నందవరానికి చెందిన ఉలిగడ్డ నరుసోజీ, పింజరి పెద్ద మిన్నెల్లకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. లారీనీ అదుపులోకి తీసుకున్నారు. ఆటో డ్రైవర్ ఎరుకుల క్రిష్ణమూర్తి ఇచిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి సమస్య పరిష్కరిస్తా

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



కార్యకర్తల నుంచి వినతులను స్వీకరిస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించి న్యాయం చేస్తామని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మాధవరంలో ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు. మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం మండలాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి, రాకేష్ రెడ్డి, పల్లెపాడు ముత్తురెడ్డి, రామిరెడ్డి, సురేష్ నాయుడు సతీష్ నాయుడు, వగరూరు గోపాల్, పవన్ కుమార్, ఇజ్రాయేల్, లింగప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం

రూ.3 లక్షల ఆస్తి నష్టం



కాలిపోతున్న గడ్డివాములు

మంత్రాలయం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పట్టణంలోని తుంగభద్ర నది ఒడ్డున శ్మశానవాటిక సమీపంలో శనివారం రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. మంత్రాలయం చెందిన సున్నం రామకృష్ణ, సున్నం గనికంటి రాగన్నలకు చెందిన రెండు గడ్డివాములను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. గ్రామస్థులు మంటలను ఆర్పేశారు. మూగజీవాల కోసం భద్రపరచుకున్న రెండు గడ్డివాముల విలువ రూ.3 లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిద్దాం: డీఎల్‌పీవో

మంత్రాలయం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చేభక్తులకు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆదోని డీఎల్‌పీవో నూర్జహాను, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు శనివారం పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో చెత్త సేకరణకు ప్రత్యేకంగా ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ మంత్రాయంలోని రోడ్లు, మురికికాలువలు పరిశుభ్రంగా ఉండేందుకు పట్టణప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ప్రభావతి దేవి, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, వైస్ సర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీలు వెంకటేష్ శెట్టి, మేకల వెంకటేష్, వార్డు మెంబర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదను సృష్టించాలి

గోనెగండ్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను సృష్టించాలని ఈవోఆర్‌డీ అనంతశయనా అన్నారు. శనివారం గోనెగండ్ల, పలు గ్రామాలలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పంచాయతీ సిబ్బందితో కలసి ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా ఈవోఆర్‌డీ మాట్లాడుతూ ఇళ్ల నుంచి చెత్తను సేకరించి వర్మికంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించి పంచాయతీలకు ఆదాయం తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో గంజహళ్లి సర్పంచ్ లింగమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మేజర్ సర్పంచ్ హైమావతి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు బీసీ రుణాలు ఇవ్వాలి

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలను అర్హులకు అందజేయాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్‌నాయుడు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ రుణాలను అధికారులు, అధికార పార్టీ నాయకులు చెప్పిన వాళ్లకు మాత్రమే ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. అర్హులకు కార్పొరేషన్ రుణాలను అందజేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రేపు రుణాలకు ఇంటర్వ్యూ

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 24న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బంగారమ్మ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల లబ్ధిదారులకు సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలను సద్వినియోగం చేసుకొని రుణాలను పొందాలన్నారు.

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు పట్టణంలోని 33 వార్డుల్లోని బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈనెల 24నుంచి 26వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 1నుంచి 7వ సచివాలయాల్లోని అభ్యర్థులకు 24న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 8-13వ సచివాలయాల్లో అభ్యర్థులకు 24వ తేదీ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు, 14నుంచి 20 సచివాలయాల్లోని అభ్యర్థులకు 25న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 21వ సచివాలయం నుంచి 26వ సచివాలయాల లబ్ధిదారులకు మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.